ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY | 5 | జయశంకర్ భూపాలపల్లి | ములుగు

గురువారం 12 డిసెంబరు 2024



పెద్దపులి జాడ కోసం మల్లూరు అడవుల్లో గాలిస్తున్న అటవీశాఖ సిబ్బంది

టైగర్ టెన్షన్..

ములుగు అరణ్యంలో పెద్దపులి సంచారం

- రెండు రోజులుగా భయం భయం
- గోదావరి దాటి మల్లూరు అడవిలోకి..
- అటు నుంచి కిన్నెరసాని వైపు పయనం
- ఏటా ఛత్తీస్‌గఢ్ అడవుల నుంచి వచ్చిపోతున్న పులులు
- 2021లో వేటగాళ్ల ఉచ్చుకు ఓ ఆడ పులి బలి


7



మంగపేట మండలంలోని తిమ్మాపూర్ అటవీ ప్రాంతంలోని వాగువద్ద పెద్దపులి పాదముద్రలు

పెద్దపులి గాండ్రింపులతో ములుగు అడవులు దద్దరిల్లుతున్నాయి. దాని సంచారం నిజమని తేలడంతో అటవీ గ్రామాలు భయంతో వణికిపోతున్నాయి. ఏటా ఇలా ఛత్తీస్‌గఢ్ వైపు నుంచి ఇక్కడి అరణ్యంలోకి వచ్చివెళుతున్నా.. ఈ సారి వచ్చిన పులి ఎక్కడ తమపై దాడి చేస్తుందోననే ఆందోళన గ్రామస్థుల్లో నెలకొంది. కానీ, ఆ పులి నెమ్మదిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కిన్నెరసాని అభయారణ్యం వైపు వెళ్లడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే మళ్లీ వెనక్కి వచ్చే అవకాశాలు ఉన్నాయనే సమాచారంతో మళ్లీ టెన్షన్ మొదలైంది. రెండు రోజులుగా పెద్ద పులి జాడలతో జనం భయభయంగా గడుపుతున్నారు.

- ములుగు/మంగపేట (ఆంధ్రజ్యోతి)



పట్టాలెక్కేదెన్నడు?

- రైలు మార్గానికి కలగని మోక్షం
- కాజీపేట - భూపాలపల్లి లైన్‌పై సందిగ్ధత
- కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా ముందుకు సాగని పనులు
- గత ఏడాది బడ్జెట్‌లో రూ.1152 కోట్ల కేటాయింపు
- సర్వే చేసి చేతులు దులుపుకొన్న రైల్వే శాఖ

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లికి రైల్వే లైన్ కలగానే మిగిలింది. సర్వేలు, నిధుల కేటాయింపులు జరిగినప్పటికీ పనులు ప్రారంభం కావడం లేదు. కేటీపీపీతోపాటు ఇతర ప్రాంతాలకు బొగ్గు సరఫరా చేసేందుకు లైన్‌క్లియర్ అయినప్పటికీ ఆదిలోనే ఆగిపోవడం పట్ల ఈ ప్రాంత ప్రజల్లో తీవ్ర నిరాశ మిగులుతోంది. కాజీపేట నుంచి భూపాలపల్లికి రైల్వేలైన్ నిర్మాణానికి ఆ శాఖ గత సంవత్సరం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే రామగుండం నుంచి భూపాలపల్లి మీదుగా మణుగూరు వరకు కూడా లైన్ వేస్తామని ప్రతిపాదనలు ఉన్నాయి. కానీ నేటికీ ఈ పనులు కార్యరూపం దాల్చలేదు.

రామగుండం టు మణుగూరు

కోల్‌బెల్ట్‌ను కలిపే రామగుండం నుంచి మణుగూరు మార్గం భూపాలపల్లి జిల్లా కేంద్రం మీదుగా ఉంటుంది. దీన్ని కోల్‌రైల్ మార్గంగా కేంద్రం రెండేళ్ల క్రితమే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు 2023-24 బడ్జెట్‌లో నిధులు కూడా కేటాయించింది. పెద్దపల్లి జిల్లా రామగుండం నుంచి మంథని.. భూపాలపల్లి జిల్లా తాడిచర్ల, భూపాలపల్లి మీదుగా వెంకటాపూర్ (రామప్ప), తాడ్వాయి అడవుల నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గోపాల్‌రావుపేట మీదుగా మణుగూరు వరకు 198 కిలోమీటర్ల రైల్వేట్రాక్ నిర్మాణం మంజూరైంది. దీని ఫైనల్ లొకేషన్ సర్వే కోసం ప్రభుత్వం రూ.3,600 కోట్లు కేటాయించింది. ఈ నేపథ్యంలో రైల్వే శాఖ అధికారులు ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలో ట్రాక్ నిర్మాణానికి మట్టి నమూనాలను సేకరించారు. ట్రాక్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతంలో ఉన్న మట్టి తట్టుకుంటుందా? లేదా అని పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మట్టి నాణ్యతను ఆధారం చేసుకుని ట్రాక్ నిర్మాణం చేయనున్నారు. ఇలా రామగుండం నుంచి మణుగూరు వరకు గుర్తించిన పాయింట్లలో మట్టి నమూనాల సేకరణ చేపట్టారు. రామగుండం నుంచి భూపాలపల్లి మీదుగా మణుగూరు వరకు నిర్మించే ఈ రైల్వేలైన్ బొగ్గు రవాణాను సులభతరం చేస్తోంది.

ప్రస్తుతం టిప్పర్ల ద్వారానే బొగ్గు రవాణా

భూపాపల్లిలోని కాకతీయ థర్మల్ పవర్ ప్లాంటుకు ప్రస్తుతం వరకు బొగ్గు రవాణా టిప్పర్ల ద్వారానే జరుగుతోంది. అయితే.. రామగుండం నుంచి రైల్వేలైన్ ద్వారా ఉప్పల్‌కు చేరుకున్నప్పటికీ అక్కడి నుంచి మళ్లీ టిప్పర్ల ద్వారా 55 కిలోమీటర్ల దూరంలో ఉన్న కేటీపీపీకి తరలించాల్సి వస్తోంది. అలాగే తాడిచర్ల, భూపాలపల్లి ఓపెన్‌కాస్టుల నుంచి కూడా టిప్పర్ల ద్వారానే బొగ్గు రవాణా జరుగుతోంది. దీంతో అధిక వ్యయంతోపాటు సమయానికి బొగ్గు అందడం లేదనే వాదనలు ఉన్నాయి. ప్రతిపాదిత రామగుండం నుంచి మణుగూరు వరకు రైల్వే లైన్ ఏర్పాటైతే అనేక ప్రయోజనాలు చేకూరనున్నాయి.

రూ.1,152 కోట్లు మంజూరు

మణుగూరు నుంచి భూపాలపల్లి, కాజీపేట

మిగతా 8వ పేజీలో...

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి పొంగులేటి

భూపాలపల్లి కలెక్టరేట్, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. చీఫ్ సెక్రటరీ శాంతికుమారి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేంరెడ్డి నరేందర్‌రెడ్డితో కలిసి హైదరాబాద్ నుంచి ఆయన బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భూపాలపల్లి నుంచి కలెక్టర్ రాహుల్ శర్మతోపాటు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వేతోపాటు వసతిగృహాల్లో మెస్ చార్జీలు, సమగ్ర కుటుంబ సర్వే తదితరల అంశాలపై మంత్రి సమీక్షించారు. ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 80లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. వారి నివాసం వద్దకు సిబ్బంది చేరుకొని సర్వే చేస్తారని తెలిపారు. ప్రతి 500 ఇళ్లకు ఒక అధికారిని నియమించామన్నారు. లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా చేపట్టాలన్నారు. ఒక్క ఇంటినీ వదలకుండా సర్వే నిర్వహించాలన్నారు. నెలాఖరు వరకు ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో వివరాలను నమోదు చేయాలన్నారు. గ్రామాలు, మునిసిపాలిటీ, కార్పొరేషన్ల ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేశామని, వాటిని ఈ సర్వేలో భాగసామ్యం చేయాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతలో 4.50లక్షల మందికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించనున్నట్టు తెలిపారు. ఈనెల 14న వసతిగృహాలకు నూతన డైట్‌ప్లాన్ ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఈకార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి

జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభోత్సవంలో మంత్రి సీతక్క



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని, ఇందుకు ఉపాధ్యాయులు వాస్తవిక, శాస్త్రీయ దృక్పథాన్ని దృష్టిలో ఉంచుకుని బోధించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ములుగు మండలంలోని జాకారం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలలో ములుగు జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్‌స్పైర్ ప్రదర్శనలను కలెక్టర్ దివాకర, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్‌తో కలిసి సీతక్క ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ పరిసరాల నుంచి శాస్త్రీయ విజ్ఞానాన్ని నేర్చుకోవాలన్నారు. గతంలో శాస్త్రవేత్తలు కూడా సమాజాన్ని, ప్రకృతిని పరిశీలించి అనేక రకాల ఆవిష్కరణలు చేశారని అన్నారు. నేటి విద్యార్థులు మన భారతీయ శాస్త్రవేత్తల జీవితాలు, వారి ఆవిష్కరణలను ఆదర్శంగా తీసుకుని నిత్యం పరిసరాలను పరిశీలిస్తూ, సహజసిద్ధ పరిస్థితులను గమనిస్తూ తద్వారా శాస్త్రీయ విజ్ఞానాన్ని నేర్చుకుని భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని అన్నారు. ములుగు జిల్లాలో ప్రతిభావంతులైన విద్యార్థులు మట్టిలో మాణిక్యాలుగా ఉన్నారని, అటువంటి వారిని వెలికితీసేవిధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కలెక్టర్ దివాకర మాట్లాడుతూ సైన్స్, గణితం సబ్జెక్టులను ఇష్టపడి చదివినవారు తమ సృజనతో నిత్యజీవితంలో ఎదురయ్యే సమస్యలకు త్వరగా పరిష్కారం చూపగలుగుతారని అన్నారు. బాల వైజ్ఞానిక ప్రదర్శన, సైన్స్‌ఫెయిర్ ప్రదర్శనను జిల్లాలోని 500 మంది విద్యార్థులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని, జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్, మండల విద్యాశాఖ అధికారి సామల శ్రీనివాసులు, గురుకులం ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, జిల్లాలోని ఎంఈవోలు, సమగ్రశిక్ష కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి...

విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని మంత్రి ధనసరి సీతక్క అన్నారు ములుగు మండలంలోని జాకారం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. క్రీడాకారులతో కలిసి కబడ్డీ ఆడారు. ఈసందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు తమలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలుగులోకి తేవాలన్నారు. ప్రతి సంక్రాంతికి ముందు ఇలాంటి క్రీడలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, మండలస్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు జిల్లా, రాష్ట్రస్థాయిల్లో రాణించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ టీఎస్.దివాకర, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, జిల్లా క్రీడలశాఖ అధికారి తుల రవి, ఎంపీడీవో రామకృష్ణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

'చిన్న కాళేశ్వరం' భూసేకరణ పూర్తి చేయండి

సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్



కాళేశ్వరంలోఅధికారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మయాంక్ సింగ్

మహదేవపూర్ రూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) : చిన్న కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు భూసేకరణను పూర్తి చేసి పనులను త్వరితగతిన పూర్తి చేసి పనులను ప్రారంభించాలని సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ అన్నారు. మండల కేంద్రంతోపాటు బొమ్మాపూర్, ఎల్కేశ్వరం మీదుగా ఉన్న మెయిన్ కెనాల్, డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ భూసేకరణ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. మండల వ్యాప్తంగా మెయిన్ కెనల్, డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ నిర్మాణానికి భూసేకరణ చేయాల్సిన ప్రాంతాలను గుర్తించి సేకరణ పూర్తి చేయాలన్నారు. మందరంచెరువు నుంచి ఎన్కపల్లి వరకు ఉండే మెయిన్ కెనాల్ భూసేకరణ ఇప్పటికే పూర్తికాగా దానికి అనుబంధంగా ఉండే డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ భూసేకరణను పూర్తి చేసి పనులు ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మండల వ్యాప్తంగా మెయిన్, డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ నిర్మాణం కోసం సుమారు 180 ఎకరాల భూమి అవసరం కాగా 80 ఎకరాల వరకు ఇప్పటికే భూసేకరణ చేసి పరిహారం చెల్లించినట్లు తెలిసింది. సబ్ కలెక్టర్ వెంట తహసీల్దార్ ప్రహ్లాద్, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, సర్వేయర్ రాజరమేష్, ఆర్ఐ జగన్మోహన్, సీనియర్ అసిస్టెంట్ సౌభాగ్యవతి, నీటిపారుదల శాఖ అధికారులు, మెగా కంపెనీ ప్రతినిధులు ఉన్నారు.

ఎయిడ్స్‌ను నిర్మూలిద్దాం

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిర్దిష్ట ప్రణాళికతో హెచ్ఐవీ, ఎయిడ్స్‌ను 2030లోగా నిర్మూలించాలని డీఎంహెచ్‌వో గోపాల్‌రావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో నాకోఅండ్ టీజీసాక్స్, మారి సంస్థ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో హైరిస్క్ ప్రాంతాల వారీగా టీంలు ఏర్పడి సర్వే నిర్వహించాలని, కొత్త హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి చికిత్స గురించి అవగాహన కల్పించాలన్నారు. హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్షత చూపరాదని అన్నారు. ఈ సమావేశంలో ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ జగదీశ్వర్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు పవన్‌కుమార్, శ్రీకాంత్, రణధీర్, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ జ్యోతి, డెమో సంపత్, మారి సంస్థ ఎన్‌జీవో ప్రోగ్రాం మేనేజర్ సదానందం, ట్రాన్స్‌జెండర్స్ ఫిమేల్ సెక్స్‌వర్కర్లు, లింక్ వర్కర్లు పాల్గొన్నారు.

'గ్రూప్-2'ను పకడ్బందీగా నిర్వహించాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 పరీక్షను ఎలాంటి మాల్ ప్రాక్టీస్, అక్రమాలకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. సంబంధిత అధికారులతో ఆయన కలెక్టరేట్‌లో బుధవారం సమావేశమ య్యారు. ఈనెల 15,16 తేదీల్లో నిర్వహించనున్న గ్రూప్-2 పరీక్ష నిర్వహ ణపై సమీక్షించారు. జిల్లాలో గ్రూప్-2 పరీక్ష కోసం 17 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 4,423 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు 17 మంది చీఫ్ సూపర్‌వైజర్లు, 37మంది బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు, 17మంది బయోమెట్రిక్ అబ్జర్వర్లు, ఒక బయోమెట్రిక్ సూపర్ అబజ్వర్‌ను నియమించినట్టు తెలిపారు. పరీక్ష కేంద్రాలను గుర్తించి ఐదుగురు రూట్ అధికారులను నియమించినట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో జిరాక్స్ కేంద్రాలను మూసివేయడంతో పాటు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. సమావేశంలో గ్రూప-2 పరీక్ష నోడల్ అధికారి విజయలక్ష్మి, పోలీస్ నోడల్ అధికారి కిషన్, ఆర్డీవో మంగిలాల్ తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో జర్నలిస్టుల నిరసన



ములుగు కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

ములుగు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మీడియా ప్రతినిధులపై సినీ నటుడు మోహన్‌బాబు దాడి చేయడాన్ని ఖండిస్తూ ములుగు కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టులు బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వార్తా కవరేజీ కోసం వెళ్లిన జర్నలిస్టుల పట్ల అనుచితంగా ప్రవర్తించిన మోహన్‌బాబు తక్షణమే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ.షఫీ అహ్మద్, జర్నలిస్టు సంఘాల నాయకులు పిట్టల మధుసుదన్, జంగిలి కోటేశ్వర్‌రావు,

మిగతా 8వ పేజీలో...



చిల్కోడులో బొప్పాయి తోటలను పరిశీలిస్తున్న మరియన్న, అధికారులు

యాజమాన్య పద్ధతులు పాటించాలి

మహబూబాబాద్ అగ్రికల్చర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఉద్యాన పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యాన పట్టుపరిశ్రమ అధికారి జినుగు మరియన్న అన్నారు. మహబూబాబాద్, డోర్నకల్, కురవి మండలాల్లో కూరగాయల సాగు, ఉద్యాన పంటలు, మామిడి, జామ, బొప్పాయి, ఆయిల్‌పామ్ తోటలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు సాంకేతిక సూచనలు తెలిపారు. టమాట సాగులో ఎగబాకించే పద్ధతిలో సాగు చేయడం ద్వారా మేలైన నాణ్యమైన దిగుబడి, అత్యధిక ఆదాయం పొందవచ్చని చెప్పారు. మామిడిపూత పిందె సమయంలో తీసుకోవాల్సిన సస్యరక్షణ పద్ధతులతో పాటు పంట మార్పిడి చేసి ఆయిల్‌పామ్ తోటను సాగు చేసుకోవాలని చెప్పారు. బొప్పాయితో పాటు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను పండించుకోవాలని సూచించారు. ఈ క్షేత్ర సందర్శనలో ఉద్యాన అధికారి శాంతిప్రియ, ఆయిల్‌ఫెడ్ ఫీల్డ్ అధికారి చంద్రప్రకాష్, బిందుసేద్య ప్రతినిధి అగస్టిన్ పాల్గొన్నారు.

సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఏసీపీ



సిబ్బందికి సూచనలిస్తున్న ఏసీపీ నర్సయ్య

పాలకుర్తి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం చేయవద్దని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సర్కిల్ కార్యాలయాన్ని ఏసీపీ నర్సయ్య సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సరంలో సర్కిల్ పరిధిలో ఎన్ని కేసులు నమోదయ్యాయి, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయని వాటిని పరిష్కరించేలా పనిచేయాలని ఆదేశించారు. కేసులు పెండింగ్‌లో లేకుండా పని చేయాలని అన్నారు. ఆయన వెంట సీఐ మహేందర్‌రెడ్డి, పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల ఎస్సైలు పవన్‌కుమార్, యకూబ్ హుస్సేన్, రాజు, సృజన్‌కుమార్ ఉన్నారు.

గణిత టాలెంట్ టెస్టుకు 100 మంది హాజరు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో డీఈవో రమేష్

జనగామ కల్చరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మ్యాథమెటిక్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన గణిత టాలెంట్ టెస్టుకు వందమంది హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ధర్మకంచ జడ్పీ పాఠశాలలో జిల్లా స్థాయి గణిత టాలెంట్ టెస్టును నిర్వహించగా ఎంఈవో రాజేందర్ ప్రశ్నపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం నిర్వహించిన ముగింపు సమావేశానికి ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎం.లింగం అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా డీఈవో ఎం.రమేష్ హాజరై మాట్లాడుతూ ఈ పరీక్షతో విద్యార్థుల్లో పోటీతత్వం అలవడుతుందని, తద్వారా ఖచ్చితత్వం పెంపొందించబడతాయన్నారు. టాలెంట్ టెస్టులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఫోరం జనరల్ సెక్రటరీ ఎం.శ్రీనివాస్, హెచ్ఎం టి.శ్రీనివాస్, ఏఎంవో బొమ్మనబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లికి వచ్చి మృత్యు ఒడికి..

- మాధన్నపేట చెరువులో అదుపుతప్పి పడ్డ కారు
- ఊపిరాడక నర్సింహులపేట ఏఈవో మృతి
- కారులో నుంచి దూకి ప్రాణాలు దక్కించుకున్న మరొకరు

నర్సంపేట టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవలనే ఓ యువతితో నిశ్చితార్థం.. మరో రెండు నెలల్లో వివాహం.. ఇంట్లో పెళ్లి ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి.. ఈ క్రమంలో స్నేహితుడికి సోదరుడి వివాహానికి వచ్చిన ఆ యువకుడిని అనుకోని ప్రమాదం వెంటాడింది. స్నేహితులతో సంతోషంగా గడుపుదామని చెరువు కట్టకు వెళ్లగా చెరువే మృత్యువై మింగేసింది. కట్టమీద కారులో వెళుతుండగా అదుపు తప్పి పడిపోగా ఊపిరాడక మరణించాడు. ఇదే ప్రమాదంలో మరొకరు కారులో నుంచి బయటకు దూకి ప్రాణాలను దక్కించుకున్నారు. ఈ ప్రమాదం బుధవారం వరంగల్ జిల్లా నర్సంపేట మండలం మాధన్నపేట గ్రామ శివారులోని మాధన్నపేట చెరువులో ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం..

మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రానికి చెందిన మిర్యాల వెంకన్న - పద్మ దంపతుల రెండో కుమారుడు మిర్యాల విష్ణు (27) ఇదే మండలంలో వ్యవసాయ శాఖలో ఏఈవోగా విధులు నిర్వర్తిస్తున్నాడు. వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని కమలాపురం శివారులోని సత్యం ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగిన తన స్నేహితుడు కానిస్టేబుల్ ప్రణీత్ సోదరుడి వివాహానికి హాజరయ్యాడు. విష్ణుతో పాటు నర్సింహులపేటకు చెందిన స్నేహితులు ప్రేమ్‌కుమార్‌రెడ్డి, వీరేందర్‌తో పాటు మరికొందరు హాజరయ్యారు. వివాహానంతరం ఫంక్షన్‌హాల్‌కు దగ్గరలో నున్న మాధన్నపేట చెరువు కట్ట వద్దకు సేదతీరేందుకు మృతుడు విష్ణు, ప్రేమ్‌కుమార్‌రెడ్డి కారులో వెళ్లారు. ఈ క్రమంలో చెరువు చివరలోనున్న మత్తడి సమీపంలో కట్ట కిందకు వెళ్తుండగా కారు అదుపు తప్పి చెరువులోకి దూసుకెళ్లింది. ఇదే సమయంలో స్థానికులు గమనించి కేకలు వేయగా కారులో ముందుసీట్లో కూర్చున్న ప్రేమ్‌కుమార్‌రెడ్డి డోరు తీసుకొని బయటకు దూకి ప్రాణాలు దక్కించుకున్నాడు. డ్రైవింగ్ చేస్తున్న విష్ణు కారులో ఉండిపోవడంతో చెరువులోకి దూసుకెళ్లిన కారు బోల్తాపడి మునిగిపోయింది. దీంతో విష్ణు కారులోనే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ రమణమూర్తి, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని జేసీబీ యంత్రంతో, మాధన్నపేట యువకుల సహాయంతో చెరువులో నుంచి కారును, అందులోని విష్ణు మృతదేహాన్ని బుధవారం సాయంత్రం బయటకు తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేటలోని మార్చురీకి తరలించారు.



విష్ణు మృతదేహం

కుటుంబంలో విషాదం

మృతుడు విష్ణుకు ప్రణీత్ అనే కానిస్టేబుల్ నర్సింహులపేటలో పనిచేస్తున్న క్రమంలో పరిచయమయ్యాడు. దీంతో స్నేహితుడి సోదరుడి వివాహానికి వెళ్లిన స్నేహితులతో కలిసి ఉత్సాహంగా గడిపిన విష్ణు.. అంతలోనే మృతిచెందడంతో ఇటు స్నేహితులు, కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మరో రెండు నెలల్లో పెళ్లి పీటలు ఎక్కాల్సి ఉండగా, మృత్యు ఒడిలోకి వెళ్లడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు.

నర్సింహులపేటలో విషాదం

నర్సింహులపేట: రెండు నెలల్లో పెండ్లి భాజా మోగాల్సిన ఆ ఇంట్లో చావుడప్పు మోగుతున్నది. నర్సంపేటకు మిత్రుడి సోదరుడి వివాహానికి వెళ్లిన ఏఈవో మిరియాల విష్ణు (28) మాధన్నచెరువులో కారు అదుపు తప్పి చెరువులో పడిన ఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడని బుధవారం సాయంత్రం సమాచారం అందడంతో నర్సింహులపేట వాసులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. విష్ణు నర్సింహులపేట మండలంలో వ్యవసాయ విస్తరణ (ఏఈవో) అధికారిగా జయపురం క్లస్టర్‌లో విధులు నిర్వహిస్తూ రైతులతో పాటు అన్నివర్గాల ప్రజల మన్ననలు పొందారు. ఇటీవలనే పెళ్లి సంబంధం కుదిరిందని, ఫిబ్రవరి మాసంలో పెళ్లి ముహూర్తం ఖరారైందని, పెట్టిపీటలు ఎక్కాల్సిన కొడుకు కానరాని లోకాలకు వెళ్లాడని తల్లిదండ్రులు విలపిస్తున్న తీరుతో అక్కడున్నవారు కన్నీరు మున్నీరయ్యారు. దీంతో నర్సింహులపేటలో విషాదం నెలకొన్నది.

గుడికి వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల

బంగారం, వెండితో పాటు నగదు చోరీ

మట్టెవాడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గుడికి వెళ్లి వచ్చేసరికి గుర్తు తెలియని వ్యక్తి ఇంటిని గుల్ల చేశాడు. ఇంటి తాళాన్ని పగలగొట్టి బంగారం, వెండి, నగదును అపహరించుకుపోయాడు. ఈ సంఘటన వరంగల్ పిన్నవారి వీధి మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మట్టెవాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వరంగల్ పిన్నవారి వీధిలో వజేసింగ్ అనే వ్యాపారి నివాసం ఉంటున్నారు. వజేసింగ్ ఇటీవల రాజస్థాన్‌కు వెళ్లాడు. బుధవారం ఉదయం వజేసింగ్ భార్య లలితబాయి ఇంటికి తాళం వేసి పిల్లలతో కలిసి గుడికి వెళ్లింది. దర్శనం అనంతరం ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగలగొట్టి ఉండడాన్ని గమనించింది. లోనికి వెళ్లి చూడగా బీరువాలో దాచుకున్న నాలుగున్నర తులాల బంగారం, 60 తులాల వెండి, రూ.1.50 లక్షల నగదును చోరీ చేసినట్లు గుర్తించింది. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు, క్లూస్ టీం వచ్చి ఆధారాలను సేకరించింది. కాగా, వరంగల్ పిన్నవారి వీధిలో బుధవారం జరిగిన సంఘటనలో చోరీకి పాల్పడిన అనుమానితుడు సీసీ పుటేజీలో రికార్డు అయినట్లు పోలీసులు గుర్తించారు. పిన్నవారి వీధి డాల్ఫిన్ గల్లీ, జేపీఎన్ రోడ్డు, వరంగల్ చౌరస్తా, స్టేషన్ రోడ్డు, వరంగల్ రైల్వే స్టేషన్ వరకు ఉన్న సీసీ పుటేజీలను మట్టెవాడ పోలీసులు, సీసీఎస్ పోలీసులు పరిశీలించారు. చోరీకి పాల్పడిన అనంతరం అనుమానిత వ్యక్తి పిన్నవారి వీధి గుండా డాల్ఫిన్ గల్లీ నుంచి జేపీఎన్ రోడ్డుకు చేరుకుని అక్కడి నుంచి వరంగల్ రైల్వే స్టేషన్‌కు ఆటోలో వెళ్లినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు.



సీసీ కెమెరాకు చిక్కిన అనుమానితుడి చిత్రం

నకిలీ బంగారం అంటగట్టిన షాపు యజమాని?

వరంగల్ నగరానికి చెందిన ఒక బంగారం వ్యాపారి నకిలీ బంగారం ఇచ్చి ములుగు ప్రాంతానికి చెందిన వారిని మోసం చేసినట్లు తెలిసింది. యేడాది కిందట వరంగల్ చౌరస్తా ఆర్ఎన్‌టీ రోడ్డులోని ఒక బంగారం షాపులో ములుగు జిల్లాకు చెందిన వారు రెండు తులాల బంగారు గాజుల కోసం సదరు షాపు యజమానికి డబ్బులు ఇచ్చారు. షాపు యజమాని బంగారు గాజులు చేసి ఇచ్చారు. సంవత్సరం తరువాత బంగారం షాపు యజమాని ఇచ్చిన గాజులు నకిలీవని తేలడంతో మోసపోయామని గుర్తించి బుధవారం ములుగుకు చెందిన బాధితులు షాపు యజమానిని నిలదీశారు. దీంతో రెండు తులాల గాజులకు గాను, ప్రస్తుతం బంగారం ధర కట్టిస్తానని షాపు యజమాని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.

కోడెల వ్యవహారంలో కదిలిన డొంక

- పోలీసు విచారణలో వెలుగులోకి విస్తుపోయే నిజాలు
- అక్రమదందా కోసమే సొసైటీ ఏర్పాటు చేసినట్టు గుర్తింపు

గీసుగొండ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): 'తీగలాగితే డొంకంతా కదిలిన' చందాన వేములవాడ రాజన్న ఆలయ గోశాల నుంచి కోడెల, దూడలను తీసుకువచ్చి అక్రమంగా అమ్ముకొన్న వ్యవహారంలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ వ్యవహారంలో ఇప్పటికే ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. అయితే కోడెలను, లేగదూడెలను అక్రమంగా అమ్ముకొని సొమ్ము చేసుకునేందుకు ఏకంగా ఆలయ గోశాలలను ఎంచుకున్నట్టు బయటపడటంతో రాజన్న భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. రాజన్న ఆలయ గోశాల కోడెలను రైతులకు రెండు చొప్పున ఇచ్చేందుకు నిబంధనలు ఉండగా సదరు వ్యక్తులు రైతుల పేరుతో గంపగుత్తగా కోడెలను, లేగదూడలను తెచ్చి కబేళాలకు అమ్ముతున్నట్లు నిర్ధారణైంది. సీఐ తెలిపిన వివరాల ప్రకారం మనుగొండ గ్రామానికి చెందిన మాదాసి రాంబాబు రాజేశ్వరీ సొసైటీ ద్వారా వేములవాడ గోశాల నుంచి కోడెలను, లేగదూడలను తీసుకొచ్చి అమ్ముకుంటున్నట్టు గత నెల 29న వెలగందుల రాజు అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. దీంతో రాంబాబుపై ఈ నెల 1న కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. దీంతో పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. వేములవాడ రాజన్న ఆలయ గోశాల నుంచి కొద్దినెలలుగా రెండు దఫాలుగా 66కోడెలను తీసుకువచ్చినట్టు బయట పడింది. అనంతారానికి చెందిన మంద స్వామి, దుగ్గొండి మండలం చలపర్తి గ్రామానికి చెందిన పసునూటి శ్యామ్ తో కలిసి తీసుకొచ్చామని, గీసుగొండ, దుగ్గొండి మండలాలకు చెందిన పలువురు రైతుల నుంచి ఆధార్‌కార్డులతో పాటు వారికి సంబంధించిన భూమి పత్రాలను సేకరించి ఆలయ గోశాల అధికారులకు అందించి కోడెలను, దూడలను తీసుకొచ్చినట్టు రాంబాబు పోలీసుల విచారణలో తెలిపాడు. కొద్ది రోజుల అనంతరం తాము తీసుకొచ్చిన వాటి లో 26కోడెలను రాజన్న ఆలయ గోశాలకే తిరిగిచ్చామని, మరికొన్ని పారిపోయాయని, మిగిలిన 11 కోడెలు గట్టుక్రిందపల్లి వద్ద గల తన పాకలో ఉన్నట్టు చెప్పుకొచ్చాడు. అయితే పాకలో ఉన్న కొన్ని కోడెల చెవులకు టాగ్‌లు లేనట్లుగా పంచనామాలో పోలీసులు, అధికారులు గుర్తించారు. కాగా పారిపోయినట్లుగా చెప్పిన కోడెలను ముగ్గురూ కలిసి అమ్ముకున్నట్టు తేలటంతో బీఎన్ఎస్ 318(4) యాక్ట్ కింద అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మహేందర్ తెలిపారు. ఇక ఆధార్‌కార్డులు ఇచ్చిన వారిపై పోలీసులు ఆరా తీస్తుండగా.. గీసుగొండ, దుగ్గొండి మండలాలకు చెందిన 33 మంది నుంచి ఆధార్‌కార్డులు, భూమి పత్రాలను రాంబాబు, రాజు, శ్యాం సేకరించినట్టు సమాచారం. పోలీసులు వారిని పిలిపించి మాట్లాడారు. రాజన్న ఆయల గోశాల నుంచి కోడెలను,దూడలను తమ పేరుమీద తీసుకువచ్చి రాంబాబు, రాజు, శ్యాంలు అమ్ముతున్న విషయం తమకు తెలియదన్నారు. అయితే రైతులు లేకుండా ఆలయ గోశాల అధికారులు రాంబాబు ఒక్కరికే ఎలా ఇన్ని కోడెలను ఇచ్చారనేది గమనార్హం. రైతులు లేకుండా ఏకమొత్తంలో కోడెలను గోశాల నుంచి తీసుకు వచ్చే క్రమంలో అటు ఆలయ అధికారులను, ఇటు రైతులను డబ్బులతో రాంబాబు, రాజు, శ్యాం మేనేజ్‌చేసినట్టు అనుమానిస్తున్నారు.

రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సుధాకర్



గార్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా డిప్యూటీ తహసీల్దార్ జర్పుల సుధాకర్ నాయక్‌ను నియమించారు. హైదరాబాద్‌లో రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయనను ఏకగ్రీవ తీర్మాణం ద్వారా సభ్యులు మంగళవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సుధాకర్‌నాయక్ మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రవీణ్‌కు గౌరవ డాక్టరేట్

ములుగు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ములుగు సమీపంలోని ప్రేమ్ నగర్ షిరిడీ సాయిబాబా ఆలయ వ్యవస్థాపకుడు ఆకుల ప్రవీణ్ కుమార్ వాస్తు జోతిష్యంలో గౌరవ డాక్టరేట్ సాధించారు. బెంగుళూరుకు చెందిన శుక్రా చార్య వేదాంగ రీసెర్చ్ ఫౌండేషన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ గోపీనాథ్ చేతుల మీదుగా బుధవారం తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో అందుకున్నారు.



డాక్టరేట్‌ను అందుకుంటున్న ప్రవీణ్

రైలులో ప్రయాణిస్తూ వ్యక్తి మృతి

గిర్మాజీపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులతో కలిసి రైలులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి గుండె సంబంధిత అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం వరంగల్ రైల్వేస్టేషన్‌లో జరిగింది. వరంగల్ జీఆర్‌పీ సీఐ పి.సురేందర్ విలేఖరులకు తెలిపిన ప్రకారం... రాజస్థాన్‌కు చెందిన ఎల్.భరత్‌కుమార్(57) ప్రయివేటు ఉద్యోగం చేస్తూ చెన్నైలో తల్లితో కలిసి ఉంటున్నాడు. రాజస్థాన్‌లో జరిగిన శుభ కార్యంలో పాల్గొన్న భరత్‌కుమార్ తల్లి కమలాదేవి, మేనకోడలు రక్షితసోనితో కలిసి సోమవారం అర్ధరాత్రి రాజస్థాన్ నుంచి తాంబరం వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లో చెన్నైకు బయలుదేరాడు.

బుధవారం 5 గంటల సమయంలో భరత్‌కుమార్‌కు ఛాతిలో నొప్పి రావడంతో తల్లి, మేనకోడలు ఈ విషయాన్ని సహచర ప్రయాణీకుల ద్వారా రైల్వే కంట్రోల్‌కు సమాచారం ఇచ్చారు. ఉదయం 6.30 గంటల ప్రాంతంలో రైలు వరంగల్ రైల్వేస్టేషన్ మొదటి ప్లాట్‌ఫారంకు చేరుకోగా స్టేషన్ మేనేజర్, జీఆర్‌పీ సిబ్బంది 108 అంబులెన్స్‌తో సహా సిబ్బందిని సిద్ధంగా ఉంచారు. రైలు రావడంతో భరత్‌కుమార్‌ను ప్లాట్‌ఫారంపై దించి 108 సిబ్బంది పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతి సమాచారాన్ని వెంట ఉన్న తల్లి, మేనకోడలుకు చెప్పి ఎంజీఎం మార్చురిలో పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని తల్లికి అప్పగించి ఎస్సై మొహినుద్దీన్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. గతంలో భరత్‌కుమార్‌కు బైపాస్ సర్జరీ జరిగిందని, గుండె పోటుతో మృతి చెందినట్లుగా తెలిసిందని సీఐ పేర్కొన్నారు.

కేయూ పీజీ రెగ్యులర్ కోర్సుల పరీక్షల వాయిదా

కేయూ క్యాంపస్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిసెంబరు 18 జరగాల్సిన పీజీ రెగ్యులర్ కోర్సుల పరీక్షలన్నీ నిరవధికంగా వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి ఎప్పుడు పరీక్షల నిర్వహిస్తామనే విషయాన్ని తర్వాత ప్రకటిస్తామని వెల్లడించారు. విద్యార్థులందరూ గమనించాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారులు కోరారు.

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2321	2080
పల్లికాయ (సూక)	3500	4000
పల్లికాయ (పచ్చిది)	5500	5500
కందులు	-	-
పెసళ్లు	6812	6000
పత్తి	6935	5800
పసుపు (కాడి)	11131	11000
పసుపు (గోల)	11009	10500
తేజ మిర్చి	12000	9000
తేజ మిర్చి (కొత్తది)	15000	12000
తేజ ఏసీ	16000	14000
వండర్‌హాట్ ఏసీ	14500	11000
యూఎస్341ఏసీ	13000	11000
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	7000	3000

- వరంగల్ వ్యవసాయం

ఎస్సారెస్పీ జలాలు వచ్చేదెట్లా?

- చెట్లతో నిండిన కాలువలు.. శిథిలావస్థలో గేట్‌వాల్స్
- మరమ్మతులు పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



వెల్లికట్టె గ్రామశివారులో చెట్ల పొదలతో నిండి ఉన్న ఎస్సారెస్పీ కాలువ



గేట్‌వాల్వ్ వద్ద ఏపుగా పెరిగిన చెట్లు

తొర్రూరు రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : యాసంగి సాగు కోసం సిద్ధమవుతున్న రైతులు ఎస్సారెస్పీ జలాల కోసం ఎదురుచూస్తున్నారు. సాగు కోసం తొర్రూరు, పెద్దవంగర డీబీఎం 59, 60, 62,71 కాలువల ద్వారా 5.08 టీఎంసీ ఎస్సారెస్పీ జలాలు వస్తుంటాయి. తొర్రూరు మండలంలో 58 కుంటలు, చెరువులు ఉండగా 47 మాత్రమే నిండుతున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. మైలారం రిజర్వాయర్ నుంచి నాంచారిమడూరు ఓటీ కాలువ ద్వారా మండలంలోని ఎస్సారెస్పీ డీబీఎం కాలువల ద్వారా నీరు మళ్లించి చెరువులకు అనుసంధానం చేసిన కాలువల నుంచి పంపిస్తారు. ఎస్సారెస్పీ నీటితో 25 వేల ఎకరాల సాగు జరుగుతుండగా, కాలువలు అస్తవ్యస్తంగా మారాయి. చివరిగా ఉండే మడిపల్లి, కంఠాయపాలెం, అమ్మాపురం, గోపాలగిరి చెరువులకు పూర్తిస్థాయిలో నీరు చేరడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డిసెంబరులో నీటిని విడుదల చేస్తే సాగు చివరి సమయం వరకైనా ఎస్సారెస్పీ జలాలు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటి వరకు విడుదలపై అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కాలువల మరమ్మతులపై పట్టింపేది?

ఎస్సారెస్పీ జలాలు ప్రవహించేందుకు తీసిన కాలువలను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. కాలువల మరమ్మతును ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చేయించడానికి అనుసంధానం చేయడంతో సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఈజీఎస్ సిబ్బందితో చేయాల్సిన ఉన్నా అధికారులు అందుకు సహకరించడం లేదంటూ ఎస్సారెస్పీ అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. ఈజీఎస్ అధికారులు కాలువల్లో పనులు ఉన్నాయనే విషయాన్ని మర్చిపోయి వ్యవహరిస్తున్నారు.

వెల్లికట్టె గ్రామ శివారు లోని ఎస్సారెస్పీ కాలువ చెట్లతో నిండి ఉండగా, అక్కడ ఉన్న గేట్‌వాల్ శిథిలావస్థకు చేరుతోంది. చెర్లపాలెం-హరిపిరాల గ్రామాల మధ్య ఉన్న కాలువలు చెట్లతో నిండిపోగా దరులు మొత్తం కూలిపోతున్నా పట్టించుకోవడం లేదు. వెంకటాపురం - పెద్ద దుబ్బతండా, గోపాలగిరికి వెళ్లే చెరువు కాలువ పూర్తి పూడి చెట్లతో నిండిపోగా నీరు వృథాగా పోవడంతో పాటు చెరువులోకి రావడం లేదని ఆందోళన చెందుతున్నారు.

ఎస్సారెస్పీ జలాలు త్వరగా విడుదల చేయాలి

కొత్త వెంకట్ రెడ్డి, రైతు సంఘం మండల కార్యదర్శి



ఎస్సారెస్పీ జలాలు డిసెంబరు నుంచి నీటిని విడుదల చేయాలి. నీరు ఆలస్యంగా విడుదల చేయడంతో నేరుగా కాలువలు లేక, అస్తవ్యస్తమైన కాలువల ద్వారా నీరు చేయడం లేదు. దీంతో సాగుకు నీరు అందక పోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.

జనవరి మొదటి వారంలో విడుదల చేస్తాం

జె.సునీల్ కుమార్, ఇరిగేషన్ డీఈ, తొర్రూరు



యాసంగి పంటలకు సాగు నీరు విడుదల చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. జనవరి మొదటి వారంలో ఎస్సారెస్పీ జలాలు విడుదల చేస్తాం. ధ్వంసమైన కాలువలు, చెట్లతో నిండిన కాలువల మరమ్మతుకు ఈజీఎస్‌లో చేసే అవకాశం ఉంది. నీరు వచ్చే సమయానికి ఈజీఎస్ కూలీలతో మరమ్మతు చేస్తాం.

పోలీసుశాఖలో యువ జోష్

- కలలను నిజం చేసుకుంటున్న యువత
- తల్లిదండ్రుల ఆశలు నెరవేరుస్తూ ఉన్నత స్థాయికి..
- శిక్షణ పూర్తి చేసుకున్న 578 మంది.. వరంగల్ కమిషనరేట్‌కు కేటాయింపు
- వివిధ జోన్లలోని పోలీస్ స్టేషన్లలో విధులు


సీపీతో సమావేశంలో పాల్గొన్న కమిషనరేట్‌కు కేటాయించిన పీసీలు (ఫైల్)

వరంగల్ క్రైం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు ఉన్నత చదువులు చదివిన యువత పోలీస్‌శాఖలో చేరడానికి అంతగా ఆసక్తి చూపేవారు కాదు. ఇతర శాఖల్లో ఉద్యోగాల్లో చేయడానికే మొగ్గు చూపేవారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను పోలీసు ఉద్యోగం చేయించేందుకు భయపడేవారు. ఇక ఈ శాఖలో చేరే మహిళల సంఖ్యయితే అంతంత మాత్రంగానే ఉండేది. అలాంటిది ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. కొడితే పోలీస్ నౌకరే కొట్టాలన్నట్టుగా పురుషులు, మహిళలు అనే తేడా లేకుండా పోటీపడి పోలీస్ శాఖలోకి వస్తున్నారు. కానిస్టేబుల్‌కు ఇంటర్, ఎస్సైకు డిగ్రీ విద్యార్హతలే ఉన్నప్పటికీ పీజీలు, ఎంబీఏ, ఎంసీఏ, బీఈడీ, ఎంఈడీలు చేసిన యువత పోలీస్ కానిస్టేబుల్‌కు ఎంపికై ప్రజాసేవకు అంకితమవుతున్నారు. ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచంలో ఏదో ఒక ఉద్యోగం సాధించాలనే కసితో ఉన్న యువత ప్రజలకు ప్రత్యక్షంగా సేవ చేసేందుకు వీలుగా ఉంటుందనే ఆలోచనతో పోలీస్ కొలువుపై గురిపెడుతున్నారు.

తల్లిదండ్రుల ఆశయాలకు ప్రాణం పోస్తూ..

కొందరు తల్లిదండ్రులు తాము సాధించలేని ఆశయాలను తమ పిల్లలతో పూర్తిచేయించి ఆనందాన్ని చూస్తున్నారు. పిల్లలను ప్రోత్సహిస్తూ కొలువుల వైపు నడిపిస్తున్నారు. ఈ క్రమంలో తమ పిల్లల ఒంటిపై ఖాకీ దుస్తులు పడగానే చూసుకుని సంబురపడిపోతున్నారు. మరి కొందరు పిల్లలైతే చిన్నప్పటి నుంచి తండ్రిని పోలీస్ యూనిఫామ్‌లో చూసి తాను కూడా పోలీసే కావాలని లక్ష్యంగా పెట్టుకొని చివరికి కలను నెరవేర్చుకుంటున్నారు. ఈ క్రమంలో పురుషులతో సమానంగా మహిళలు కూడా పోటీపడి కొలువులు కొడుతున్నారు. గతంలో ఎక్కడో ఓ దగ్గర అర్బన్ ప్రాంతాల్లో ఉమెన్ పీసీ కనిపించేది. గ్రామీణ ప్రాంతాలతో పాటు నగరాల్లో సైతం మహిళలు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాలన్నా భయపడేవారు. ఇప్పుడు అన్ని ఠాణాల్లో మహిళా పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నారు.

పోలీస్‌శాఖలో అత్యవసర విభాగాల ఫోన్ నెంబర్లు

ఎమర్జెన్సీ డయల్ : 100
సీపీ వాట్సాప్ నెంబర్ : 8712685257
సైబర్ క్రైం టోల్ ఫ్రీ నెంబర్ : 1930
మాదక ద్రవ్యాల నియంత్రణ టోల్ ఫ్రీ నెంబర్ : 1908
షీ టీం ఫోన్ నెంబర్ : 8712685142

వరంగల్ కమిషనరేట్‌కు 578 మంది..

శిక్షణ పూర్తి చేసుకున్న 578 మంది కానిస్టేబుళ్లను ప్రభుత్వం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు కేటాయించింది. ఈ 578 మందిలో సెంట్రల్ జోన్‌కు 145, వెస్ట్‌జోన్‌కు 119 మంది, ఈస్ట్‌జోన్‌కు 68 మంది, మరో ఐదుగురు ఇతర విభాగాలను కేటాయించారు. ఇక 578 మందిలో 367 సివిల్ కానిస్టేబుళ్లు, 211మంది ఏఆర్ కానిస్టేబుళ్లు ఉన్నారు. 367 మంది సివిల్ కానిస్టేబుల్స్‌లో 244 మంది పురుషులు, 123 మంది మహిళలుండగా.. 211 మంది ఏఆర్ కానిస్టేబుళ్లలో 168మంది పురుషులు, 43 మంది మహిళలున్నారు.

వారం దరికి కమిషనరేట్‌లోని ఆయా పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల పోస్టింగులు ఇవ్వడంతో విధులు నిర్వర్తిస్తున్నారు. పోస్టింగ్‌లు ఇచ్చిన వారందరితో సీపీ గత నెల నవంబరు 30న సమావేశం ఏర్పాటు చేసి విధుల్లో ఎలా రాణించాలనే దానిపై దిశానిర్దేశం చేశారు.


హనుమకొండ పీఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా కానిస్టేబుళ్లు

బీఈడీ సెకండియర్‌లో ఉండగానే ఉద్యోగం వచ్చింది

వి.వినూష, వరంగల్ జిల్లా కొత్తూరు



నాన్న శ్రీనివాస్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు కావడంతో బీఈడీలో జాయిన్ చేయించారు. డిగ్రీ పూర్తికాగానే పోటీ పరీక్షలకు పై దృష్టిసారించా. ఈ లోపు పోలీసు ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ రావడంతో అప్లై చేసి ప్రిపేరయ్యాను. ఓయూలో బీఈడీ చేస్తుండగానే జాబ్ వచ్చింది. ఇక మా అక్క ఎస్‌జీటీ టీచర్‌గా పని చేస్తోంది.

లేడీ పోలీస్

- స్మార్ట్ పోలీసింగ్‌తో డిపార్ట్‌మెంట్ వైపు మహిళల ఆసక్తి
- ఒత్తిళ్లను అధిగమిస్తూ శభాశ్ అనిపించుకుంటున్న అతివలు
- 33 శాతం రిజర్వేషన్‌తో నెరవేరుతున్న కల

ప్రత్యేక

వరంగల్ క్రైం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు వంటింటికే పరిమితమైన అతివలు.. నేటి కాలంలో ఏ పనినైనా అలవోకగా చేయగలమని నిరూపించుకుంటున్నారు. పిరికితనం, బిడియాన్ని వదిలి ధైర్యంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. తమకు అందివచ్చిన ఏ అవకాశాన్ని కూడా చేజార్చుకోకుండా ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారు. అంతరిక్షంలో అడుగుపెట్టడమే కాదు.. విమాన పైలట్ నుంచి రైళ్లలో లోకో పైలట్ వరకు అన్ని రంగాల్లోనూ శభాశ్ అనిపించుకుంటున్నారు. కఠినమైన పోలీసు కొలువుల్లోనూ సత్తా చాటుతున్నారు.

వరంగల్ కమిషనరేట్‌లో మహిళా పోలీసుల సంఖ్య	
డీసీపీ	1
ఇన్‌స్పెక్టర్	2
సబ్ ఇన్‌స్పెక్టర్లు	28
ఏఎస్సైలు	39
హెడ్ కానిస్టేబుళ్లు	15
సివిల్ కానిస్టేబుళ్లు	175
ఏఆర్ కానిస్టేబుళ్లు	50

పోలీసు విధుల నిర్వహణ విషయంలో గతంలో మహిళల్లో అనేక అనుమానాలు, అపోహలు ఉండేది. ఇప్పుడు సీన్ మారిపోయింది. అంత స్మార్ట్ పోలీసింగ్ నడుస్తోంది. దానికి తోడు ఉద్యోగాల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్ ఉండటంతో పోలీస్‌శాఖ వైపు మహిళలు చూస్తున్నారు.

పోలీస్ శాఖలో రిసెప్షన్, పేపర్ వర్క్‌కే పరిమితం కాకుండా ఉన్నతాధికారులు ఏ బాధ్యతలు అప్పగించిన అవలీలగా చేసే స్తున్నారు. సివిల్ ఒక్కటే కాకుండా వీఐపీలకు బందోబస్తు నిర్వహించే ఏఆర్ విభాగం, నిత్యం రోడ్లపై విధులు నిర్వర్తించే ట్రాఫిక్, కోర్టు డ్యూటీ, టాస్క్‌ఫోర్స్ విభాగాల్లోనూ అసాధారణ విధులు నిర్వర్తిస్తున్నారు. సాధారణ పోలీస్ కానిస్టేబుళ్లే కాకుండా స్టేషన్ హౌజ్ ఆఫీసర్లు, జిల్లా పోలీస్ బాస్‌లుగా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తూ తమ సత్తా చాటుతున్నారు. వరంగల్ పోలీస్ కమిషన రేట్‌లోని మూడు జోన్లలో మహిళా పోలీస్ సిబ్బంది, అధికారులు పురుష అధికారులు దీటుగా పని చేస్తున్నారు. సెంట్రల్ జోన్ డీసీపీగా మహిళాధికారి ఉండడం ప్రత్యేకత.

ఆర్మీలో చేరాలనుకున్నా..

డి. కరుణ్య, ఎంఎస్సీ బయాలజీ, హనుమకొండ పీఎస్



చిన్నప్పటి నుంచి ఆర్మీలో జాయిన్ కావాలనే ఉండేది. సీపీ తరుణ్‌జోషి ఉన్న సమయంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోటీపరీక్షలకు హాజరయ్యా. హసన్‌పర్తి మండలం ముచ్చర్ల నుంచి వచ్చే దాన్ని. కానీ హైట్ లేకపోవడంతో ఆర్మీలోకి తీసుకోలేదు. నాన్నకు సివిల్ పోలీస్ అంటే ఇష్టం ఉండటంతో పీసీ ఈవెంట్స్, రాత పరీక్షకు హాజరై అర్హత సాధించా.

తొలి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించా : కె.అశ్వినిరెడ్డి, గుండ్లపాడు



డిగ్రీ పూర్తి చేయగానే పోలీస్ నోటిఫికేషన్ వెలువడింది. దరఖాస్తు చేసి సొంతంగానే ప్రిపేర్ అయ్యా. తొలి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించా. శిక్షణకు వెళ్లడానికి ముందు వివాహమైంది. నా భర్త ప్రభుత్వ ఉద్యోగి. గ్రూప్-2 ఆఫీసర్ కావాలనే ఆకాంక్ష ఉంది. దాని కోసం ప్రయత్నిస్తున్నా.

అమ్మ ప్రోత్సహించింది..

షహనాజ్, హనుమకొండ పీఎస్



మేం ఇద్దరం అక్కాచెల్లెళ్లం. అక్క ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో అధ్యాపకురాలిగా పని చేస్తోంది. నాన్న లేకపోవడంతో దినసరి వేతనంపైనే అమ్మ.. నన్ను, అక్కను కష్టపడి చదివించింది. ఎంసీఏ చదవిన నాకు ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే తపన ఉండేది. ఈ క్రమంలోనే పోలీస్‌గా ఎంపికయ్యా. భవిష్యత్‌లో ఉన్నత ఉద్యోగం చేయాలని కోరిక ఉంది. కచ్చితంగా సాధించి తీరుతా.

ఆంగ్ల సాహిత్యంలో శరత్ చంద్రుడు

సాహితీ సౌరభం

- అతికొద్ది మంది ఆంగ్ల రచయితల్లో ఒకరు
- ఐటీ ఉద్యోగం వదిలి సాహిత్యం వైపు అడుగులు
- 40కి పైగా రచనలతో ప్రత్యేక గుర్తింపు
- ఇతిహాసాల్లోని పాత్రలే కథా వస్తువులు
- కామన్వెల్త్ బుక్ ప్రైస్ లాంగ్ లిస్టులో చోటు


భార్య అదితితో రచయిత శరత్ కొమర్రాజు



శరత్ కొమర్రాజు ఆంగ్లంలో రాసిన సుప్రసిద్ధ నవలలు

హనుమకొండ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తెలుగు రచయితలు చాలామంది ఉన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోలో అయితే కొదవే లేదు. కథలు, కవిత్వం, నవలలు చాలా రాశారు.. రాస్తున్నారు కూడా. కానీ ఆంగ్లంలో రచనలు చేసేవారి సంఖ్య చాలా తక్కువ. ఆంగ్లంలో ఒకటీ రెండు రచనలు చేసినవారు, ముఖ్యంగా నవలా రచయతలుగా పేరు తెచ్చుకున్నవారిని వేళ్లమీద లెక్కపెట్టొచ్చు. కానీ ఆంగ్ల సాహిత్యాన్నే వృత్తిగా ఎంచుకొని బహుళ సంఖ్యలో పుస్తకాలు రాసిన వారు అరుదుగా ఉంటారు. అలాంటి వారిలో ఒకరు యువ ఆంగ్ల రచయిత శరత్ కొమర్రాజు. ఇప్పటికే ఆంగ్లంలో 40కిపైగా నవలలు రాసిన శరత్‌కు ఇంగ్లిష్ సాహిత్యాభిమానుల్లో మంచి క్రేజ్ ఉంది. ఆయన పుస్తకాలకు మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ ఉంది. శరత్ రాసిన నవలల్లో చాలా వరకు హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. ఈ క్రమంలో ఆయన పుస్తకాలు కామన్వెల్త్ బుక్ ప్రైస్ లాంగ్‌లిస్టులో కూడా చోటు దక్కించుకున్నాయి. హనుమకొండ బాలసముద్రానికి చెందిన శరత్ కొమ రాజు సీరియస్, సీరియల్ ఇంగ్లిష్ రైటర్ అని చాలా మందికి తెలియదు. తండ్రి డాక్టర్ రవిశంకర్, తల్లి సరళ లాయర్ కాగా ఆయన భార్య అదితిది కర్నాటక. వారికి సరయు, మల్హార్ పిల్లలున్నారు. శరత్ విద్యాభ్యాసమంతా ఇంగ్లిష్ మీడియంలోనే సాగడంతో ఆంగ్ల భాషపై ఆయనకు సహజంగానే పట్టు ఏర్పడింది.

ఆకట్టుకునే శైలి ఆయన సొంతం

క్రైమ్, రొమాన్స్ ఫిక్షన్, నాన్ ఫిక్షన్స్ రాయడంలో శరత్ కొమర్రాజుది అందె వేసిన చేయి. ఆయన ఇంగ్లీష్ భాషా పరిజ్ఞానం ఫైవ్ పాయింట్ సమ్ వన్ ఫేమ్ రచయిత చేతన్ భగత్, ద బాయ్ హూ లవ్డ్ రైటర్ దుర్జోయ్ దత్త, ఐటూ హాడ్ ఏ లవ్ స్టోరీ సృష్టికర్త రవీందర్ సింగ్ స్థాయిలో పాఠకులను కట్టిపడేస్తుంది. విచిత్రమేమిటంటే శరత్ కొమ్మరాజు... చేతన్ భగత్, దుర్జోయ్ సింగ్, రవీందర్ సింగ్‌లాగా ఐటీ ప్రొఫెషన్ నేపథ్యం నుంచి రచనా రంగంలోకి వచ్చిన యువ రచయిత. కొవిడ్ సమయంలో శరత్ రచనలకు బ్రేక్ పడగా.. గతేడాది నుంచే మళ్లీ రాయడం మొదలు పెట్టారు. ప్రస్తుతం ఆయన ఒక నవల రాస్తుండగా అది దాదాపు పూర్తి కావొచ్చింది.

ఒకటి నుంచి పదో తరగతి వరకు హనుమకొండ బిషప్ బరేట్టా స్కూల్లో, ఇంటర్ మొదటి సంవత్సరం విజయవాడ కాలేజీలో చదవగా.. ఆయన ఇంటర్‌లో ఉన్నప్పుడే తండ్రి డాక్టర్ రవిశంకర్ కుటుంబంతో న్యూజిలాండ్‌కు వెళ్లడంతో శరత్ అక్కడే ఇంటర్ ద్వితీయ సంవత్సరం, యూనివర్సిటీ ఆఫ్ ఆక్లాండ్‌లో బీఎస్సీ మ్యాథమెటిక్స్ కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో బీటెక్ పూర్తిచేశారు. ఆక్లాండ్‌లోనే ఐబీఎం కంపెనీలో ఐదేళ్లు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేసిన ఆయన 2011లో స్వదేశానికి తిరిగి వచ్చిన తర్వాత కొంత కాలంలో బెంగళూరు ఐబీఎంలో ఉద్యోగం కొనసాగించారు.

బాల్యం నుంచే పుస్తకాలంటే ఇష్టం

శరత్‌కు బాల్యం నుంచే పుస్తకాలపై ఆసక్తి ఉండేది. ఆక్లాండ్‌లో ఉన్నప్పుడు కూడా నిత్యం లైబ్రరీకి వెళ్లి చదివేవారు. అలా ఆంగ్ల సాహిత్యంపై అభిమానం ఏర్పడి.. ఇంగ్లిష్‌లో రచనలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుని చదువు కొనసాగిస్తూనే ఇంగ్లిష్‌లో రచనలకు శ్రీకారం చుట్టారు. అలా మర్డర్ ఇన్ అమరావతి అనే తొలి నవల రాయగా.. ఈ మిస్టరీ, థ్రిల్లర్‌కు పాఠకుల నుంచి ఆదరణ లభించింది.

2011లో ఇండియాకు తిరిగి వచ్చిన తర్వాత బెంగళూరులో ఉద్యోగం చేస్తూనే తన రచనా వ్యాసంగాన్ని కొనసాగించారు. కొంత కాలానికి నెలకు రూ.లక్షకుపైగా వేతనం వచ్చే సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి రాజీనామా చేసి పూర్తిగా రచనపైనే దృష్టి సారించారు. కుటుంబం నుంచి పూర్తి సహకారం లభించడంతో రచననే వృత్తిగా ఎంచుకొని ఫుల్‌టైమ్ రైటర్‌గా మారారు. ఇప్పటికి ఆయన మర్డర్ ఇన్ అమరావతితో పాటు ది విండ్స్ ఆఫ్ హస్తినాపూర్ (ఆరు భాగాలు), ది ట్రీ బేర్స్ విట్నెస్ బీర్బల్ (2 భాగాలు), ఆమ్నియన్ కింగ్ ఆఫ్ మధుర, క్రౌస్ ఆగ్రా, ది సాంగ్ ఆఫ్ బృందావన్ (4 భాగాలు), ది పప్పీటీర్స్ ఆఫ్ పాలెం, ద ఇరైజ్ ఆఫ్ హస్తినాపూర్ (2 భాగాలు), ఎటర్నిటి బిగిన్స్, లాయాల్టీ నెట్, ది బర్త్ ఆఫ్ ద్వారాకా, ది క్వీన్ ఆఫ్ అస్తినాపూర్ తదితర నవలలు రాశారు. మహాభారత క్యారెక్టర్ గైడ్స్, మర్డర్ ఇన్ అమరావతి బెస్ట్ సెల్లర్ బుక్స్‌గా పాఠకుల విశేష అభిమానాన్ని చూరగొన్నాయి.

ఇతిహాసాల్లోని పాత్రలే..

శరత్ రాసిన నవల్లో క్రైమ్, థ్రిల్లర్‌తో పాటు ఇతిహాస గాథల నేపథ్యంగా సాగిన రచనలు కూడా ఉన్నాయి. మహాభారత-క్యారెక్టర్ గైడ్స్, ది విండ్స్ ఆఫ్ హస్తినాపూర్ ఈ కోవకు చెందినవే. మహాభారతంలోని 14పాత్రలను ఎంచుకొని వాటి గురించి రాసిన విశ్లేషణాత్మక నవల పాత్రల మధ్య సంఘర్షణను, మహాభారతంలో వాటి ప్రభావాన్ని, మానవ సంబంధాల్లోని సంక్లిష్టతను ఎత్తి చూపుతాయి. మహాభారత ఎ స్సెన్షియల్స్ ఆమ్నిబస్‌లోని ఆరు పుస్తకాలు, క్యారెక్టర్ గైడ్స్ సిరీస్‌లోని 14పుస్తకాలు కృష్ణుడు, అర్జునుడు, ద్రౌపది, కర్ణుడు, దుర్యోధనుడు ఇలా అన్ని ప్రధాన పాత్రల స్వరూప స్వభావాలను కళ్లకు కట్టినట్టు చూపుతాయి.

ది సాంగ్ ఆఫ్ బృందా వన్-హస్తినా పూర్ బృందావనంలో కృష్ణుని బాల్యం, ఆయన ద్వారక యువ రాజుగా ఎదిగిన తీరు మహాభారత ప్రియులందరినీ ఆకట్టుకుంది. ది విండ్స్ ఆఫ్ హస్తినాపూర్ గంగ, సత్యవతి పాత్రల ఔన్నత్యాన్ని, వారి బలమైన వ్యక్తిత్వాన్ని, వేదనను అధిగమిస్తూ తమను తాము నిలదొక్కుకున్న తీరును అద్భుతంగా ఆవిష్కరిస్తుంది.

వరంగల్ నగరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి • జిల్లా అధికారులతో హైదరాబాద్‌లో సమీక్ష

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగర అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టిసారించారని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ, వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రి వరంగల్ జిల్లా పర్యటనలో ఇక్కడి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అనేక హామీలు ఇచ్చారని, ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకుని నగర అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బుధవారం వరంగల్ నగరాభివృద్ధిపై హైదరాబాద్ సచివాలయంలో జిల్లా మంత్రులు కొండా సురేఖ, ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారుడు వేం నరేదర్‌రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రతీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన డీపీఆర్‌లను త్వరితగతిన తయారు చేయాలని అధికారులకు సూచించారు. వరంగల్ నగరంలో నిర్మించే రింగ్‌రోడ్డు జాతీయ రహదారులకు కనెక్టివిటీ ఉండేలా చూడాలని, ఈ ప్రాజెక్టు భూ సేకరణ యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని సూచించారు.

ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ యుద్ధ ప్రాతిపదికన భద్రకాళి చెరువు శుద్ధీకరణ పనులను వేగంగా చేపట్టాలని ఆదేశించారు. ప్రాధాన్యత క్రమంలో పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మునిసిపల్ శాఖ కార్యదర్శి దానకిశోర్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ శ్రీదేవి, మైనింగ్ శాఖ కార్యదర్శి సురేందర్ మోహన్, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య సత్య శారదాదేవి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో పాటు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు పకడ్బందీగా సేకరించాలి

హనుమకొండ కలెక్టరేట్/వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల వివరాలు పకడ్బందీగా సేకరించాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లు, గ్రూపు-2 పరీక్షల నిర్వహణ, సంక్షేమ హాస్టల్స్ నూతన డైట్ మెనూ పెంపు ప్రారంభోత్సవం తదితర అంశాలపై బుధవారం రాత్రి మంత్రి పొంగులేటి జిల్లాల కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న సుమారు 80లక్షల మంది వివరాలను డిసెంబరు నెలాఖరులోగా పకడ్బందీగా సేకరించాలన్నారు. ప్రతీ 500 ఇళ్ల దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలనకు ఒక సర్వేయర్‌ను నియమించాలన్నారు.

అలాగే ఈ నెల 15, 16 తేదీలలో జరిగే గ్రూపు-2 పరీక్షలను సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని, డిసెంబర్ 14వ తేదీన డైట్‌చార్జీల పెంపు ప్రారంభోత్సవం ఉంటుందన్నారు. సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ.. ప్రజాపాలన ద్వారా సేకరించిన దరఖాస్తులలో ఇందిరమ్మ ఇళ్ల కింద ప్రభుత్వానికి 80లక్షల దరఖాస్తులు వచ్చాయని, వీటిని సర్వేయర్ ద్వారా ఇంటింటికీ తిరుగుతూ క్షేత్రస్థాయిలో విచారణ చేపడతామన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బుర్ర వెంకటేశం మాట్లాడుతూ.. గ్రూపు-1, గ్రూపు-3 పరీక్షలను విజయవంతంగా నిర్వహించామని, ఈ నెల 15, 16 తేదీలలో రెండు సెషన్‌లలో గ్రూపు-2 పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌వో విజయలక్ష్మీ, జడ్పీ సీఈవో రామిరెడ్డి, బీసీ, ఎస్సీ సంక్షేమశాఖ అధికారులు పుష్పలత, భాగ్యలక్ష్మీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా, ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హైదరాబాద్ నుంచి ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్ రెడ్డి, హనుమకొండ కలెక్టరేట్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేష్, ఇతర జిల్లా అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల కోసం 2,33,356 దరఖాస్తులు

వరంగల్ కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల కోసం 2 లక్షల 33 వేల 356 దరఖాస్తులు రాగా, ఇప్పటి వరకు 1, 430 దరఖాస్తుల సర్వే పూర్తి చేశామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 500 దరఖాస్తులకు ఒక సర్వేయర్‌ను నియమించి 20 రోజుల్లో పూర్తిస్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేస్తామన్నారు. గ్రూప్-2 పరీక్షకు 11వేల 309 మంది అభ్యర్థులు హాజరవుతుండగా, ఇందుకుగాను 28 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసిన అన్ని వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు.

టైగర్.. టెన్షన్

ములుగు అరణ్యంలో పెద్దపులి సంచారం


ఆలుబాక వద్ద కనిపించిన పెద్ద పులి పాద ముద్రలు

ఏటా ఛత్తీస్‌గఢ్ అడవుల నుంచి వచ్చిపోతున్న పులులు

ములుగు/మంగపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలోని ఏటూరునాగారం అభయారణ్యం 2.90లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంతో సరిహద్దును కలిగి ఉండటంతో ఈ అడవుల్లో క్రూర మృగాలు, వన్యప్రాణాలు వృద్ధి చెందుతున్నాయి. ఈ క్రమంలో అరుదైన పెద్ద పులి ఈ అడవులను ఆవాసంగా చేసుకుంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ఇంద్రావతి నేషనల్ పార్కు నుంచి ఆహారం, తోడు అన్వేషణలో భాగంగా పులి ప్రతీఏటా ఏటూరునాగారం అడవులకు వచ్చిపోతోంది. 2021 నుంచి వరుసగా పులి సంచారాన్ని ఫారెస్టు అధికారులు ట్రాక్ చేశారు.

తాజాగా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ అడవుల నుంచి సోమవారం రాత్రి వెంకటాపురం(నూగూరు) మండలంలోకి వచ్చిన పులి మంగళవారం గోదావరి నదిని దాటి మంగపేట మండలంలోకి ప్రవేశించింది. బుధవారం మల్లూరు అడవుల మీదుగా కిన్నెరసాని వన్యప్రాణి విభాగం పరిధిలోని అడవుల్లోకి వెళ్లింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇద్దరిపై దాడికి పాల్పడ్డ ఘటనల నేపథ్యంలో అప్రమత్తమైన జిల్లా అటవీ శాఖ అధి కారులు పులి కదలికలపై దృష్టిసారించారు. సరిహద్దు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. మల్లూరు ప్రాజెక్టు, తిమ్మాపూర్ అటవీ ప్రాంతంలోని నీటి చెలిమెల వద్ద పులి పాద ముద్రలను బుధవారం గుర్తించిన అటవీ శాఖ అధికారులు ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసినా ఎక్కడా దాని సంచారానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు లభ్యం కాలేదని డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్ తెలిపారు. నలుగురు సభ్యులతో కూడిన ఆరు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. మంగపేట- తాడ్వాయి సరిహ ద్దు అడవుల్లోని దామెరతోగు, మర్కోడు అడవి మీదుగా పెద్ద పులి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభయారణ్యంలోకి ప్రవేశించినట్లు బుధవారం సాయంత్రం గుర్తించారు. పులి సంచారం విస్తృతంగా ఉన్న నేపథ్యంలో ఏ క్షణంలోనైనా తిరిగి ములుగు అడవుల్లోకి వచ్చే అవకాశముందని, 15-20 రోజులు ప్రత్యేక బృందాలు 24 గంటలు పనిచేస్తాయని డీఎఫ్‌వో తెలిపారు.

అడవి దారిలోనే పయనం

ములుగు అడవుల్లో సంచరిస్తున్న పెద్దపులి గ్రామాల వైపు వచ్చిన సందర్భాలు అసలే లేవు. పులి ఆహారంగా తీసుకునే అడవి పంది, జింకలు, దుప్పులు, కనుజు లాంటి వన్యపాణులు పుష్కలంగా ఉండటంతో వాటిని వేటాడటం సులువుగా మారింది. దీంతో ఆకలి తీరిన పులి తన దారిన తాను వెళ్లేది. సాధారణంగా పునరుత్పత్తి కోసం ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చే పులులు ఆ తర్వాత వెళ్లిపోయేవి. కానీ, ఇటీవల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మనుషులపై పులి దాడి చేసిన నేపథ్యంలో ములుగు జిల్లాలోని అటవీ గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

వేటగాళ్ల ఉచ్చుకు బలైన పులి

ప్రతీయేటా ఆగస్టు నుంచి డిసెంబరు మధ్యలో పులి సంచరిస్తున్నట్టు స్పష్టమవుతోంది. దాని కదలికలను పసిగట్టిన అటవీ శాఖ అధికారులు సమీప గ్రామాలు, గొత్తికోయగూడేల ప్రజలను అప్రమత్తంచేస్తూ వస్తున్నారు. అయితే అనూహ్యంగా 2021 ఆగస్టులో ఓ ఆడపులి వేటగాళ్ల ఉచ్చుకు బలైంది. కిన్నెరసాని అడవుల నుంచి వచ్చిన పులి తాడ్వాయి మండలంలోని కొడిశాల, లింగాల అడవుల్లో సంచరించింది. కొడిశాల అడవిలోని ఓ గొత్తికోయ గుంపునకు చెందిన ఆదివాసీలు సెప్టెంబరు 21న ఉచ్చులు వేసి దాని హతమార్చారు. చర్మం, గోళ్లు, మాంసాన్ని తీసుకొని ఎముకలను పాతిపెట్టారు. దాని కొవ్వుతో నూనెను కూడా తయారు చేశారు. చర్మం, గోళ్లను విక్రయించే క్రమంలో అక్టోబరు 3న అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. ఈ సంఘటన అప్పుడు దేశవ్యాప్తంగా సంచలనమైంది. పులిని చంపిన గొత్తికోయలు దాని మాంసాన్ని వండుకుని తిన్నారు. అప్పటి వరకు గొత్తికోయలు అడవిని నరికి పోడు వ్యవ సాయం మాత్రమే చేస్తున్నారని, చిన్నచిన్న వన్యప్రాణులను వేటాడుతారని భావించిన అటవీ అధికారులు... ఏకంగా పులిని చంపారని తేలడంతో ఆశ్చర్య పోయారు. దీంతో అప్పటి నుంచి పులి కదలికలను రహస్యంగా ఉంచుతున్న అధికారులు దాని కదలికలపై నిఘా పెడుతున్నారు.

టైగర్ జోన్ ప్రతిపాదన

ఒకప్పుడు పెద్దపులికి ఆవాసంగా ఉండి ఇప్పుడు చుట్టపుచూపునకు పరిమితమైన ములుగు అభయారణ్యంలో పులికి శాశ్వత విడిది కల్పించేందుకు గతంలో ప్రయత్నాలు జరిగాయి. గడ్డి మైదానాలు, వన్యప్రాణులు ఎక్కువగా ఉండటంతో పులి ఆవాసానికి అనువుగా మార్చాలని భావించారు. ఏటూరునాగారం, కన్నాయిగూడెం, తాడ్వాయి, మంగపేట మండలాల సరిహద్దులోని అడవిని టైగర్ జోన్‌గా మార్చాలనే ప్రతిపాదన వచ్చింది. ఇందుకు పెద్ద సంఖ్యలో గ్రామాలను తరలించాల్సి రావడంతో సర్వత్రా వ్యతిరేకత వచ్చింది. దీంతో అటవీ అధికారులు ఆలోచనను తాత్కాలికంగా విరమించుకున్నారు.

వాజేడు మండలంలో చిరుత పులి కలకలం


చిరుతవిగా భావిస్తున్న పాదముద్రలు

వెంకటాపురం (ఆంధ్రజ్యోతి) : ఓవైపు వెంకటాపురం మండ లం మండలంలోని బోదాపురం సమీప అడవుల్లో సంచరించిన పెద్దపులి గోదావరి దాటి మం గపేట మండలంలోకి వచ్చిన ట్లుగా అధికారులు నిర్ధారించిన క్రమంలోనే బుధవారం వాజేడు మండలంలో చిరుతపులి సంచారం వార్తలు కలకలం రేపాయి. వాజేడు మండలంలోని గుమ్మడిదొడ్డిలో చిరుతపులి పాదముద్రలను గమనించిన గ్రామస్థులు కంగారు పడ్డారు. సమాచారం అందుకున్న దూలా పురం రేంజ్ అటవీ శాఖ అధికారులు పాదముద్రల నమూనాలు సేకరించి నిర్ధారణ కోసం సంబంధిత అధికారులకు పంపారు.

అయితే అవి చిరుతవేనని స్పష్టత రాలేదు. కానీ ఇప్పటికే వెంకటాపురం, మంగపేట మండలాల్లో సంచరించింది పెద్దపులేనని అటవీ శాఖ అధికారులు గుర్తించిన నేపథ్యంలో వాజేడు మండలంలో చిరుత సంచరించిందంటూ ప్రచారం జరగటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కాగా తమకు అధికారుల నుంచి స్పష్టత వచ్చిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని, ప్రస్తుతం తాము సేకరించిన పాదముద్రలు హైనావిగా భావిస్తున్నట్టు దూలాపురం రేంజ్ అటవీ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్ రీల్

పుష్కరాలకు మాస్టర్ ప్లాన్

మహాదేవపూర్, డిసెంబర్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాళేశ్వరం పుణ్యక్షేత్రమైన కాళేశ్వర, ముక్తేశ్వర స్వామి దేవాలయంలో మే 15 నుంచి నిర్వహించనున్న సరస్వతీ పుష్కరాలకు మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తున్నారు. ఓ ఆర్కిటెక్ సంస్థ ఆధ్వర్యంలో ఈ ప్రణాళిక తయారు అవుతోంది. దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల ఆదేశాల మేరకు పుష్కరాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా మాస్టర్ ప్లాన్ తయారు చేస్తున్నారు. అలాగే కాళేశ్వర, ముక్తేశ్వర దేవాలయంలో భక్తులకు ఇబ్బందులు కాకుండా క్యూలైన్లలో ఆలయంలోకి వచ్చి వెళ్లే విధంగా, వాహనాల పార్కింగ్, వీఐపీ ఘాట్, పుష్కర ఘాట్‌తోపాటు రోడ్లను పరిశీలించి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

భూపాలపల్లి కృష్ణకాలనీ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొని ఓ వ్యక్తి గాయపడిన సంఘటన భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి పట్టణానికి చెందిన రాజు ఓ ప్రైవేటు సంస లో ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. ధుల్లో భాగంగా జయశంకర్ విగ్రహం నుంచి అంబేద్కర్ కూడలి వరకు బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి కారు ఢీకొంది. దీతో అతడికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు అతడిని ఆస్పత్రికి తరలించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వెంకటాపురం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెద్దపులి సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు ధ్రువీకరించగా మండలంలోని బోదాపురం, ఆలుబాక, పెంకవాగు, తిప్పాపురం, రామచంద్రాపురం, సీతారామపురం గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కొప్పుల తిరుపతిరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయ పనులకు, పశువుల మేతకు, ఇతర పనులకు వెళ్లేవారు ఒంటరిగా వెళ్లవద్దని, ఎక్కడైనా పెద్దపులి సంచరిస్తున్నట్లు తెలిస్తే తక్షణమే అటవీశాఖ అధికారులకు కాని, పోలీసులకు కాని సమాచారం అందించాలన్నారు. విషప్రయోగం చేసి చంపాలని ప్రయత్నిస్తే వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద నేరస్తులు అవుతారని అన్నారు.

హాస్టల్ వద్ద ఆకతాయిలు.. పోలీసుల కౌన్సెలింగ్!

కాటారం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగారం మోడల్ స్కూల్ హాస్టల్ సమీపంలో కొందరు ఆకతాయిలు వెకిలి చేష్టలు చేయడంతో సమాచారం అందుకున్న పోలీసులు వారిని స్టేషన్‌కు తరలించి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ చేసినట్లు తెలుస్తోంది. హాస్టల్‌కు దగ్గరలో మంగళవారం రాత్రి బర్త్‌డే పార్టీ నిర్వహించి చలిమంట పెట్టుకుని అరవడంతో విద్యార్థులు భయాందోళనకు గురియ్యారు. దీనిపై హాస్టల్ సిబ్బంది పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో ఎస్సై అభినవ్ ఆదేశాల మేరకు పోలీసులు నలుగురిని పట్టుకొచ్చి తల్లిదండ్రుల ఎదుట కౌన్సెలింగ్ ఇచ్చి పంపారని సమాచారం.

మల్లారంలో గీతా జయంతి

మల్హర్, డిసెంబరు 11 : మండలంలోని మల్లారంలో బుధవారం భగవద్గీత జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పుర వీధుల మీదుగా సాయంత్రం నగర సంకీర్తన నిర్వహించారు. గ్రామంలోని భక్తాంజనేయ ఆలయంలో మహిళలు భగవద్గీత పారాయణం చేశారు. మార్గశిర మాసం శుద్ధ ఏకాదశి రోజున గీతా జయంతిని నిర్వహించుకోవడం ఆనవాయితీ అని అర్చకులు శ్యామ్‌సుందర్ శర్మ తెలిపారు.

గిరిజనేతరులకు ఏజెన్సీ సర్టిఫికెట్లు చట్ట విరుద్ధం

మన్యసీమ పరి రక్షణ సమితి

మంగపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో ఉన్న కొందరు గిరిజనేతర అధికార పార్టీకి చెందిన ఒరిస్సా శ్రీకాకుళం, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వలస వచ్చిన వాకిఅ బోగస్ ఎస్టీ కుల, ఏజెన్సీ సర్టిఫికెట్లను రెవెన్యూ అధికారులు జారీ చేస్తున్నారని, ఇది చట్ట విరుద్ధమ ని మన్యసీమ పరి రక్షణ సమితి, డోలుదెబ్బ మండల కమిటీ ఆరోపించింది. బుధవారం స్థానిక తహసీల్దార్ రవీందర్‌కు ఈ మేరకు వినతిపత్రం ఆ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సర్టిఫికెట్ల జారీ చట్ట విరుద్ధమని, వీటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల నాయకులు తాటి నాగరాజు, కొమరం రవికుమార్, టి. నర్సింహారావు, గట్టిపెల్లి అర్జున్, తోలేం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యరంగానికి ప్రభుత్వం పెద్దపీట

పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క


ములుగులో అంబులెన్స్‌లను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని ఆరోగ్యవంతమైన తెలంగాణ సమాజంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం వైద్యరంగానికి పెద్దపీట వేస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రి ఆవరణలో ఏటూరు నాగారం ఐటీడీఏ ద్వారా మంజూరైన ఆరు ఈఎంఆర్ఐ 108 సర్వీస్ అంబులెన్స్‌లను ఆమె కలెక్టర్ టీఎస్.దివాకర, ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్‌లతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఇప్పటి వరకు ములుగు జిల్లాలోని అన్ని మండలాల్లో తొమ్మిది 108 అంబులెన్స్‌లు ప్రజలకు అత్యవసర ఆరోగ్యసేవలు అందిస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మంగపేట, తాడ్వాయి, ములుగు, వెంకటాపురం మండలాలకు అదనంగా మరో నాలుగు కొత్త అంబులెన్స్‌లను మంజూరు చేసిందని అన్నారు. ఐటీడీఏ పరిధిలోని మహబూబాబాద్ జిల్లాలోని గంగారం, గూడూరు మండలాలకు అదనంగా మరో రెండు అంబులెన్స్‌లను కేటాయించినట్లు తెలిపారు. అనంతరం ఏరియా ఆస్పత్రిలో ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మైత్రి ట్రాన్స్ ఉమెన్ క్లినిక్‌ను ప్రారంభించారు. ట్రాన్స్‌జెండర్లు అర్ధనారీశ్వర స్వరూపాలని, సమాజంలో ఎన్నో విధాలుగా అవమానాలు, ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. వారి అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందిస్తుందని పేర్కొన్నారు. అందులోభాగంగానే జిల్లాకేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో మైత్రి ట్రాన్స్ ఉమెన్ క్లినిక్‌ను ప్రారంభించడం జరిగిందని అన్నారు. క్లినిక్‌ను ట్రాన్స్‌జెండర్లు వినియోగించుకోవాలని అన్నారు. కలెక్టర్ దివాకర మాట్లాడుతూ జిల్లాలోని 30మంది ట్రాన్స్‌జెండర్లలో తొమ్మిదిమందికి ట్రాన్స్‌జెండర్ ఐడీ కార్డులు, సర్టిఫికెట్లు అందించినట్లు తెలిపారు. ట్రాన్స్‌జెండర్లకు ప్రభుత్వ ఆర్థిక పునరావాస పథకం కింద నాన్ బ్యాంకు లింకేజీ కింద వందశాతం సబ్సిడీ కింద రూ.50వేల చొప్పున ఇద్దరికి అందజేసినట్లు పేర్కొన్నారు. స్వయం ఉపాధి కోసం ట్రాన్స్‌జెండర్లకు టైలరింగ్ ట్రైనింగ్ కోసం ప్రతిపాదనలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో గోపాల్‌రావు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీశ్వర్, జిల్లా సంక్షేమ అధికారి శిరీష, ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌వో క్రాంతికుమార్, స్టాటిస్టికల్ ఆఫీసర్ రాజ్‌కుమార్, ప్రోగ్రాం మేనేజర్ మహేందర్, ట్రాన్స్‌జెండర్ సంఘం జిల్లా నాయకురాలు కల్పన, ఇందు, మైత్రి క్లినిక్ డాక్టర్లు, ఎఫ్ఆర్‌వో గణేష్, డీసీపీవో ఓంకార్, డీఎంసీ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.


నారాయణపూర్‌లో చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న సీతక్క

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

ఉపాధ్యాయులు నూతన పరిజ్ఞానంతో విద్యాబోధన చేసి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని, స్వచ్ఛందసంస్థల సహకారంతో జిల్లాను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తానని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో క్వాల్ కం కంపెనీ, ట్రాన్సారం పాఠశాలల యాజమాన్యం సంయుక్తంగా 9,10తరగతి విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినీవిద్యార్థులకు ఇంగ్లిష్, గణితం, సైన్స్ పాఠాలు బోధించే అధ్యాపకులు, ప్రధానోపాధ్యాయులకు శిక్షణ తరగతులు ప్రారంభించి పుస్తక ఆవిష్కరణ చేశారు. ఈసందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన చేసే ఉపాధ్యాయులు నూతన పరిజ్ఞానంతో విద్యాబోధన చేస్తే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని అన్నారు. అన్నిరంగాలను అభివృద్ధిచేయడంలో ప్రభుత్వం కేటాయించే నిధులు సరిపోతున్నప్పటికీ స్వచ్ఛంద సంస్థల సహకారంతో మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థినీవిద్యార్థులకు నూతన పరిజ్ఞానంతో విద్యను బోధించడానికి ఉపాధ్యాయులకు స్వచ్ఛంద సంస్థల వారు శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడం ఆశించతగ్గ విషయమని అన్నారు. ప్రపంచ విషయాలను గ్రామీణ ప్రాంతాల ప్రజలు తెలుసుకున్నప్పుడే విద్యాబోధన మెరుగుపడినట్లు అవుతుందని, ఈవిషయంలో గ్రామీణ ప్రాంతాల్లో విద్యను బోధించే ఉపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. రాష్ట్రంలో అద్భుతమైన మార్పు రావాలంటే విద్యతోనే సాధ్యమవుతుందని, జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడానికి 20సంస్థలతో ఒప్పందం జరిగిందని తెలిపారు. ఆయా సంస్థల సహకారంతో ప్రజలకు అవసరం ఉన్న అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని, ఒక ఇంట్లో ఒకరు చదువుకుని ఉంటే ఆ కుటుంబం పూర్తిస్థాయిలో బాగు పడుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. కలెక్టర్ టీఎస్.దివాకర మాట్లాడుతూ మూడురోజులపాటు ములుగు మండలంలోని బండారుపల్లి, మదనపల్లి, వెంకటాపూర్ మండలంలోని జవహర్‌నగర్ గ్రామాల్లోని పాఠశాలల్లో గణితం, ఇంగ్లిష్, సైన్స్ పాఠ్యపుస్తకాలపై ఢిల్లీ అధికారులు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ఏటూరునా గారం ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా, ప్రిన్సిపాల్ ఎన్‌క్రైనర్, క్వాల్‌కామ్ సుంకర సుధీర్‌కుమార్, ప్రోగ్రాం డైరెక్టర్ శ్రద్ధాఝా, హెడ్ ప్రోగ్రాం, క్వాలిటీ ఇంప్లిమెంటేషన్ స్పెషలిస్ట్ నేహారానా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, డీఈవో పాణిని, మేనేజర్ లీడర్‌షిప్, కమ్యూనిటీ ప్రోగ్రాం హితేష్ దశభయ, టెక్నికల్ ప్రాజెక్టు ఆఫీసర్ మిహిర్ పాండాతోపాటు 20పాఠశాలల హెచ్‌ఎంలు, టీచర్లు పాల్గొన్నారు.

ఉద్యోగుల వినతి

ములుగు (ఆంధ్రజ్యోతి): సమ్మెబాట పట్టిన సర్వశిక్ష ఉద్యోగులు ములుగుకు వచ్చిన మంత్రి సీతక్కను కలిశారు. వినతిపత్రాన్ని అందజేశారు. గతంలో హనుమకొండలో జరిగిన సర్వశిక్ష ఉద్యోగుల నిరసన దీక్షా శిబిరాన్ని టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో సందర్శించి సంఘీబావం తెలిపిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సీతక్క విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్వశిక్ష ఉద్యోగుల సంఘం నాయకులు భాస్కర్‌రెడ్డి, కర్ణాకర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్‌పరం చేసే విధానాన్ని విరమించుకోవాలని కోరుతూ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో కార్మికులు మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. యూనియర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బండి నర్సయ్య నాయకులు ముత్యాల రాజు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలతో పూర్వ ప్రాథమిక విద్య పటిష్టం

వెంకటాపూర్ (ఆంధ్రజ్యోతి): పూర్వ ప్రాథమిక విద్యను పటిష్టం చేయడానికే రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత అంగన్‌వాడీ భవనాల నిర్మాణం చేపడుతుందని మంత్రి ధనసరి సీతక్క అన్నారు. బుధవారం మండలంలోని నారాయణపూర్ గ్రామంలోని పాఠశాల ఆవరణలో అంగన్‌వాడీ కేంద్రం నూతన భవనానికి ఆమె శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆమె చిన్నారులకు అన్నప్రసాన చేసి అక్షరాభ్యాసం చేయించారు. గర్భిణులకు సీమంతాలు చేశారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ పిల్లల మానసిక వికాసం అనేది పూర్వ ప్రాథమిక విద్యతోనే జరుగుతుందని, అందులో భాగంగానే చక్కని పౌష్టికాహారంతోపాటు పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను అందించడం జరుగుతుందని అన్నారు. పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడం ద్వారా భవిష్యత్ తెలంగాణ పౌరులను నైపుణ్యమైన వనరులుగా తీర్చిదిద్దడం ద్వారా రాష్ట్రం మరింత పురోగమిస్తుందని అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, అదనపు కలెక్టర్ సంపత్‌రావు, జిల్లా సంక్షేమ అధికారి శిరీష, సీడీపీవోలు ప్రేమలత, ధనలక్ష్మి, కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, పార్టీ నాయకులు బైరెడ్డి భగవాన్‌రెడ్డి, చెన్నోజు సూర్యనారాయణ, బండి శ్రీనివాస్, జంగిలి రవి, మామిడిశెట్టి కోటి, చెన్నోజు శ్రీనివాస్, మిల్కూరి ఐలయ్య, బాష బోయిన పోశాలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

అలాగే మండలకేంద్రంలో వెన్నెల మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన పెరటికోళ్ల పెంపకం మదర్ యూనిట్ నుంచి బ్యాక్ యార్డ్ పౌల్ట్రీ లబ్ధిదారులకు కోడిపల్లలను మంత్రి పంపిణీ చేశారు. మహిళా శక్తిలో 17రకాల పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిందని అన్నారు. ఇది మండలానికి ఒక యూనిట్‌ను మంజూరు చేసినట్టు తెలిపారు. మండలకేంద్రంలోని చందన గ్రామైక్య, రుద్రమదేవి స్వయం సహాయక సంఘంలోని మహిళలకు శ్రీనిధి ద్వారా రూ.2లక్షల 91వేల రుణం అందించినట్టు చెప్పారు.

నల్లబ్యాడ్జీలతో జర్నలిస్టుల నిరసన

(5వ పేజీ తరువాయి)

జాలిగం శ్రీవాస్, నర్రా రఘు వీర్, గాదం దేవేందర్, ముకులోతు శరత్, ఎమ్డీ.జలీల్ తదితరులు పాల్గొన్నారు.

● గోవిందరావుపేట (ఆంధ్రజ్యోతి): సినీనటుడు మోహన్‌బాబు, ఆయన అనుచరులు పాత్రికేయులపై దాడి జరపడంపై మండల కేంద్రంలో జర్నలిస్టులు నిరసన తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. తహసీల్దార్ సృజన్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్నవరం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మోడం సారంగపాణి, సీపీఎం నాయకుడు గుండు రామస్వామి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లకావత్ నర్సింహనాయక్, ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి నెమలి నర్సయ్య, పాత్రికేయులు సామ బుచ్చిరెడ్డి, బత్తిని వెంకట్, ఎల్లారెడ్డి, కల్లెం రవి పాల్గొన్నారు.

వెంకటాపురం (ఆంధ్రజ్యోతి): మీడియా ప్రతినిధులపై సినీనటుడు మోహన్‌బాబు, అతని అనుచరులు దాడి చేయడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో పాత్రికేయులు ర్యాలీ నిర్వహించారు. దాడి చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ లక్ష్మీరాజయ్యకు, పోలీస్‌స్టేషన్‌లో సీఐ బండారి కుమార్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ ర్యాలీలో పలువురు రాజకీయపార్టీల నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్ చిడెం మోహన్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంపా రాంబాబు, సీపీఎం నాయకుడు కుమ్మరి శ్రీను, బీజేపీ నాయకుడు శేఖర్, జర్నలిస్టులు బాచినేని ప్రవీణ్, కలకోటి సంతోష్, రాజేంద్రప్రసాద్, రవి, శ్యామ్, అభి, సాంబ, దుర్గాప్రసాద్, శ్రీకాంత్, చారి, చంటి పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న కలెక్టర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్

వెంకటాపూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణలో లబ్ధిదారులకు బుధవారం కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్ర మం జరిగింది. కలెక్టర్ టీఎస్.దివాకర, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ మండలంలోని 59మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మేడారం అభివృద్ధి పనులను ఆదివాసీలకే కేటాయించాలి

తాడ్వాయి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగబోయే మేడారం సమ్మక్క-సారలమ్మ మినీ జాతరలో చేపట్టబోయే అభివృద్ధి పనులను ఆదివాసీ గిరిజన నిరుద్యోగులకు కేటాయించాలని గిరిజనాభ్యుదయ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ముద్దబోయిన రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం ఆయన మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ యువత నిరుద్యోగంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అయితే ప్రతి ఏడాది మేడారం జాతర అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఆదివాసీ గిరిజన సంఘాలకు ఇచ్చేవారని తెలిపారు. ఈ పనులను అధికారులు బడా కాంట్రాక్టర్లకు అప్పగించి ఆదివాసీలకు తీరని అన్యాయానికి గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా మంత్రి సీతక్క చొరవ తీసుకుని మినీ మేడారం జాతర అభివృద్ధి పనులను ఆదివాసీ గిరిజన యువతకు కేటాయించి ఆదుకోవాలని ఆయన కోరారు.

అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ పనుల ప్రారంభం

కాటారం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కాటారం రెవెన్యూ గ్రామ శివారు సర్వే నెంబర్49 తిమ్మన్నకుంటలో కేటాయించిన స్థలంలో ఏటీసీ (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్) నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. నిర్మాణ సంస్థ సైట్ ఇంజనీర్లు, ఐటీఐ ప్రిన్సిపాల్ భిక్షపతి పర్యవేక్షణలో సిబ్బంది జేసీబీలతో గుంతలు తీయించారు. కాగా ఏటీసీ, ఐటీఐ భవనాల నిర్మాణం కోసం 3ఎకరాల 35గుంటలు కేటాయించినట్లు సమాచారం. త్వరితగతిన ఏటీసీ నిర్మాణం పూర్తి చేసి వచ్చే విద్యాసంవత్సరంలో ఐటీఐ విద్యార్థుల కోసం అత్యాధునిక సాంకేతిక కోర్సులను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రిన్సిపాల్ భిక్షపతి తెలిపారు.

ఘనంగా మినీ క్రిస్మస్ వేడుకలు


మినీ క్రిస్మస్ వేడుకల్లో క్రైస్తవులు

కాటారం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరాంపల్లి బెతెస్థ చర్చిలో బుధవారం మినీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. పలు గ్రామాల నుంచి వచ్చిన వందలాది మంది క్రైస్తవుల సమక్షంలో ఫాస్టర్లు ప్రేమ్‌సాగర్, డేవిడ్ రవీందర్, రవిప్ర సాద్ మినీ క్రిస్మస్ వేడు కలు నిర్వహించారు. కేక్ కట్ చేసి ప్రార్థనాగీతాలు ఆలపించారు. పేదలు, వితంతువులు, పాస్టర్లకు బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చర్చి ఆవరణ అంతా సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన చర్చిల పాస్టర్లు, క్రైస్తవ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కేటీకే-6వ గనిలో భద్రత పక్షోత్సవాలు


సేఫ్టీ బృందంతో సింగరేణి అధికారులు

కాకతీయఖని, డిసెంబరు 11(ఆంధ్ర జ్యోతి): సింగరేణి భూపాల పల్లి ఏరియాలోని కేటీకే-6వ గనిలో 55వ భద్రత పక్షోత్స వాలు బుధవారం ఘనంగా నిర్వహిం చారు. సేఫ్టీ కమిటీ కన్వీనర్ సైదులు ఆధ్వర్యంలో తొమ్మిది మంది గనిలో పర్యటించారు. ఈ సందర్భంగా సైదులు మాట్లా డుతూ ప్రతి ఒక్కరూ స్వీయ రక్షణ పాటిస్తూ రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిని సాధించాలన్నారు. సంస్థ మనుగడలో కార్మికుల పాత్ర కీలకమన్నారు. పని స్థలాల్లో సేఫ్టీ ప్రధానమన్నారు. ప్రతి ఒక్కరూ రక్షణ సూత్రాలను ఎప్పటికప్పుడు పాటించాలన్నారు.. ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి, అధికారులు వెంకటరమణ, జీఎల్ ప్రసాద్, రామ్‌భరోసా మహతో, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భారతీయ భాషోత్సవాలు

కాటారం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కాటారం జడ్పీహెచ్ఎస్ ఆవరణలో మండల స్థాయి భారతీయ భాషా ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాలను ఇంచార్జి ఎంఈవో శ్రీదేవి ప్రారంభించారు. మహాకవి సుబ్రహ్మణ్యభారతి జన్మదినాన్ని పురస్కరించుకుని సమ్మయ్య నాయక్ అధ్యక్షతన, రాజునాయక్ కో-ఆర్డినేటర్‌గా నిర్వహించిన భాషా ఉత్సవాల్లో పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ తదితర భాషల్లో పలు విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. జయశంకర్ సారస్వత సమితి వ్యవస్థాపకుడు గడ్డం లక్ష్మయ్య విశిష్ట తిథిగా హాజరై సుబ్రహ్మణ్య భారతి భాషా అభివృద్ధి కోసం చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. నృత్యం పోటీల్లో కాటారం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు సౌమ్య, కీర్తన బృందం ప్రథమ, గంగారం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ద్వితీయ, సుందర్రాజ్‌పేట జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు తృతీయ బహుమతిపొందారు. వ్యాసరచనలో మాంటిస్సోరి విద్యార్థి సాహిత్య ప్రథమ, గిరిజన బాలికల గురుకులం విద్యార్థి అమూల్య ద్వితీయ, ఆదర్శ హైస్కూల్, కాటారం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు మనోజ, లీలశ్రీ తృతీయ స్థానం పొందారు. స్టోరీ టెల్లింగ్‌లో గిరిజన బాలికల గురుకుల విద్యార్థి అక్షయ ప్రథమ, మాంటిస్సోరి విద్యార్థి ప్రణీత ద్వితీయ, కాటారం జడ్పీహెచ్ఎస్ విద్యార్థి భారతి తృతీయ స్థానం సాధించారు. ఆర్‌యూపీపీ మండల అధ్యక్షుడు ప్రతాప్, డీఆర్‌పీ సురేష్, ఉపాధ్యాయులు సదువలయ్య, రాజేందర్, రాజారాం, కవిత పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్ నిర్మాణంతో మానేరుకు జలకళ



మల్హర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాల సరిహద్దులోని వల్లెంకుంట, సోమన్‌పల్లి మానేరులో నిర్మించిన చెక్‌డ్యాంతో మానేరు జలకళను సంతరించుకుంది. చెక్‌డ్యాం నిర్మాణంతో సుమారు రెండు కిలో మీటర్ల మేర మానేరులో మీటర్ ఎత్తులో నీరు నిలిచింది. చెక్‌డ్యాం నిర్మాణం చేపట్టిన వద్ద నుంచి నైనాగుహలను దాటి మానేరులో నీరు నిల్వ ఉంది. రెండు జిల్లాల సరిహద్దులోని పీవీనగర్ బ్రిడ్జి పై నుంచే వెళ్లే వారిని ఈ దృశ్యం ఇట్టే ఆకట్టుకుంటుంది. చెక్‌డ్యాంలో నీటి నిల్వ వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయని రైతులు అభిప్రాయ పడుతున్నారు.

పట్టాలెక్కేదెన్నడు?

(5వ పేజీ తరువాయి)

నుంచి భూపాలపల్లి వరకు రైల్వేలైన్ సర్వే చేయడానికి కేంద్రం రూ.3,600 కోట్లు కేటాయించింది. ఇందులో ఫైనల్ లొకేషన్ సర్వే కోసం రూ.1,152 కోట్లు మంజూరు చేసింది. ఈ క్రమంలో కాజీపేట నుంచి హసన్‌పర్తి మీదుగా కరీంనగర్ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ రైల్వే స్టేషన్ సమీపంలోని మగ్రిపల్లి గ్రామం వద్ద సైడ్‌ట్రాక్ ఏర్పాటు చేయనున్నారు. మగ్రిపల్లి ట్రాక్ నుంచి చిట్యాల మండలం జడల్‌పేట మీదుగా భూపాలపల్లి వరకు ఈ లైన్ నిర్మాణం చేపట్టనున్నారు. చిట్యాల, మొగుళ్లపల్లి, భూపాలపల్లి మండలాల్లోని పలు గ్రామాల మీదుగా ఏర్పాటు కానుండగా రవాణా తో పాటు అక్కడి ప్రజల ప్రయాణానికి ఉపయోగకరంగా ఉంటుందనే హర్షం వ్యక్తమవుతోంది. ఈ లైన్ నిర్మాణం పూర్తయితే కాజీపేట నుంచి భూపాలపల్లికి 30-40 నిమిషాల సమయం పట్టొచ్చని అంచనా.

లైన్ రాకతో అనేక ప్రయోజనాలు

భూపాలపల్లికి రైల్వే లైన్ నిర్మాణం వల్ల కోల్‌బెల్ట్ ప్రాంతమంతా ప్రయాణం చేయడానికి సులభతరం అవుతుంది. పైగా సమయం ఆదా అవుతుంది. ఖర్చులు తగ్గుతాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఇక్కడి నుంచి మణుగూరు, కొత్తగూడెం, రామగుండం, గోదావరి ఖని, పెద్దపల్లి, కాజీపేట, చెన్నై, హైదరాబాద్, నాగ్‌పూర్, ఢిల్లీ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు మార్గం సుగమం అవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కృషి చేస్తూనే ఉన్నాం..



కాజీపేట నుంచి భూపాలపల్లికి రైల్వేలైన్ ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. ఈ మేరకు అన్ని వివరాలతో సంబంధిత రిప్రజెంటేషన్‌ను అందిస్తాం. అన్ని విషయాలపై చర్చిస్తున్నాం. ప్రజల ఆకాంక్షను తప్పకుండా నెరవేర్చేందుకు కృషి చేస్తాం.

- కడియం కావ్య, వరంగల్ ఎంపీ

రైల్వే లైన్ వస్తే రవాణా సులభం



రైలు మార్గం వస్తే రవాణా సులువు అవుతుంది. ఇతర కోల్ బెల్ట్ ప్రాంతాల ప్రజలకు అనువుగా ఉంటుంది. ఈ ప్రాంతంలో పనిచేసే కార్మికులు ఇతర సింగరేణి ప్రాంతాలకు వెళ్లడానికి రైలు మార్గం ఎంతో ఉపయోగ పడుతుంది. భూపాలపల్లికి రైలు మార్గం వస్తే ప్రజలు హర్షిస్తారు. ఈ కల నెరవేరితే ఈ ప్రాంత ప్రజలు ప్రభుత్వాలకు రుణపడి ఉంటారు.

- మధూకర్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ భూపాలపల్లి బ్రాంచి ఉపాధ్యక్షుడు

అధికార పార్టీ నాయకుడి దురుసు ప్రవర్తన

మహిళా ఎంపీడీవోతో పరుష పదజాలం

ఏటూరునాగారం రూరల్, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి) : మహిళా ఎంపీడీవోపై అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు దురుసుగా ప్రవర్తించిన సంఘటన ఏటూరునాగారంలో చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని జడ్పీహైస్కూల్‌లో ఈనెల 10న సీఎం కప్ క్రీడలు జరుగుతున్నాయి. ఈ క్రీడలను పర్యవేక్షించేందుకు బుధవారం మండల కేంద్రానికి చెందిన అధికార పార్టీ కీలక నాయకుడు వెళ్లాడు. అక్కడి ఏర్పాట్లను ఆయన పరిశీలించాడు. ఈ క్రమంలో ఎంపీడీవోకు ఆ నాయకుడు ఫోన్ చేశాడు. ఎక్కడున్నారని అడగ్గా రామన్నగూడెంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పర్యవేక్షిస్తున్నాని ఆమె చెప్పారు. దీంతో అతడు. వెంటనే సీఎం కప్ క్రీడలను ఎవరూ చూస్తున్నారు? అని ప్రశ్నించాడు. దీంతో ఎంపీడీవో బదులిస్తూ 'ఎవరు చూసేదేముంది సార్ ? నిన్ననే ప్రారంభించాం కదా' అని వివరించారు. దీంతో అతడు ఇక్కడెందుకు లేరు? అడగ్గా స్పెషల్ ఆఫీసర్లు చూస్తున్నారని, అనుమతి తీసుకొనే తానిక్కడికి వచ్చానని చెప్పారు. ఈ క్రమంలో క్రీడలు జరిగే ప్రదేశంలో మంచినీటి సౌకర్యం సరిగా లేదని ఆ నాయకుడు ఎంపీడీవోతో అనగా మంగళవారమే వాటర్ క్యాన్లు అవసరమున్నాయని ఆమె తెలిపారు. దీంతో ఆ నాయకుడు కోపోద్రిక్తుడూ 'బుద్ధి ఉందా.. జ్ఞానం ఉందా?' అని పరుషపదజాలతో మాట్లాడాడు. నువ్విక్కడికి రా.. అంటూ ఏక వచనంతో ఇష్టానుసారంగా అన్నాడు. ఈ మాటలతో ఎంపీడీవో తీవ్ర మనస్తాపానికి గురై కంటతడి పెట్టినట్లు తెలిసింది. ఈ విషయంపె ఆమె కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

మండల స్థాయి సీఎం కప్ క్రీడలు ప్రారంభం

గోవిందరావుపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల ఆవరణలో బుధవారం ఎంపీడీవో జవహర్‌రెడ్డి అధ్యక్షతన మండలస్థాయి సీఎం కప్ క్రీడలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ తేజవతి ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు సీఎంకప్ క్రీడలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ క్రీడల్లో 350మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సృజన్ కుమార్, అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు పాలడుగు వెంకటేశ్వర్‌రావు, సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు పాలడుగు వెంకటకృష్ణ, పన్నాల ఎల్లారెడ్డి, ఎంఈవో దివాకర్, ఎంపీవో శరత్, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ సాయిదుర్గ, సిబ్బంది ఇక్బాల్, ఫిజికల్ డైరెక్టర్లు సుధాకర్, కనకయ్య, రాజు, సరిత, నాగమణి, అవంతిక, శ్రీనివాస్, జగదీశ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై నిరంతర పోరాటం

ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి రమేష్


విలేకరులతో మాట్లాడుతున్న రమేష్

కాకతీయఖని, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు నిరంతరంగా పోరాడుతామని ఏఐటీయూసీ భూపాలపల్లి బ్రాంచి కార్యదర్శి మోటపలుకుల రమేష్ అన్నారు. భూపాలపల్లిలోని కొమురయ్య భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడున్నర ఏళ్ల తర్వాత సింగరేణి యాజమాన్యం స్ట్రక్చర్ సమావేశం నిర్వహించిందన్నారు. అందులో సింగరేణి ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలపై చర్చించామన్నారు. కార్మికు లకు కేటాయించిన క్వార్టర్లలో వైరింగ్, రూఫ్ లీకేజీలు, పేయింటింగ్, ఫ్లోరింగ్ తదితర సివిల్ సమస్యలు ఉన్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. రామప్ప కాలనీలో ఓపెన్ జిమ్, స్విమ్మింగ్ పూల్, కూరగాయల మార్కెట్, కామన్ ప్లేగ్రౌండ్, శ్మాశానవాటిక, స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని, కేటీకే-8,5,1వ గనుల్లో మ్యాన్ రైడింగ్ పొడగించాలని, సింగరేణి కమ్యూనిటీ హాళ్లలో సౌకర్యాలు కల్పించాలని, మహిళా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా చూడాలని యాజమాన్యాన్ని కోరామన్నారు. అందుకు సానుకూలంగా స్పందించారని అన్నారు.